


జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఆదిలాబాద్
మంచిర్యాల-కుమరం భీం-నిర్మల్
ఆదివారం 17 మే 2026 పేజీలు : 8


# జన్ భాగేదారి అభియాన్' కార్యక్రమాలపై సమీక్ష



# జిల్లాలో రౌడీయిజాన్ని కను మరుగు చేస్తాం

ప్రతివారం రౌడీ షీటర్స్, సస్పెక్ట్ షీటర్ల పై తనిఖీలు పద్ధతి మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

జిల్లా ప్రజలకు ప్రశాంత వాతావరణం కల్పించడమే, నేర రహిత సమాజాన్ని నిర్మించడం లక్ష్యం



# ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి

- నిజమైన ఓటరు ఓటు హక్కు కోల్పోరాదు
- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి
- బీఎల్‌వోలకు సమగ్ర శిక్షణ ఇవ్వాలి
- ఓటరు ప్రోజెనీ మ్యాపింగ్ త్వరగా పూర్తి చేయాలి




5



# వరుస క్రమంలోనే వడ్ల తూకం!

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలకు తావులేకుండా, రైతుల సీరియల్ నంబర్ ప్రకారమే తూకం ప్రక్రియ నిర్వహించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) చంద్రయ్య ఆదేశించారు. శనివారం మండలంలోని కన్నెపల్లి, గూడెం, నంబాల, వెల్గనూరు గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా సుమారు రెండు గంటల పాటు కేంద్రాల్లోనే ఉండి రైతులతో మాట్లాడారు. వెల్గనూరులో నిబంధనలకు విరుద్ధంగా తమకు తెలిసిన వారికి, బంధువులకు ముందుగా తూకం వేస్తున్నారని రైతులు ఫిర్యాదు చేయగా.. అదనపు కలెక్టర్ తీవ్రంగా స్పందించారు. "ముందు వచ్చిన వారికి ప్రాధాన్యత ఇవ్వాల్సిందే.. ఇందులో పక్షపాతానికి తావులేదు. నిబంధనలు అతిక్రమిస్తే కేంద్రం నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటాం" అని హెచ్చరించారు.

3

## సమ్మె కాలపు ఒప్పందాన్ని అమలు చేయాలి

**ఏఐటీయూసి బెల్లంపల్లి రీజియన్ ప్రెసిడెంట్ బోగే ఉపేందర్**



**మంచిర్యాల, 16, మే (ప్రజా జ్యోతి):** సమ్మె కాలంలో కార్మికులతో కుదిరిన ఒప్పందాన్ని యాజమాన్యం వెంటనే అమలు చేసి, ప్రతి నెల 15వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసి బెల్లంపల్లి రీజియన్ ప్రెసిడెంట్ బోగే ఉపేందర్ శనివారం డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థ బెల్లంపల్లి ఏరియాలో గతంలో లారీ డ్రైవర్లు, క్లీనర్లు వేతనాల పెంపు మరియు ఇతర సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేపట్టిన సందర్భంగా యాజమాన్యంతో ఒప్పందం కుదిరిందని తెలిపారు. ఆ ఒప్పందం ప్రకారం డ్రైవర్లకు 22 వేలు క్లీనర్లకు,11 వేలు వేతనం చెల్లించడంతో పాటు ప్రతి నెల 15 లోపు జీతాలు ఇవ్వాలని నిర్ణయించారని తెలిపారు అయితే ఈ నెల 15 వరకు వేతనాలు చెల్లించకపోవడంతో శుక్రవారం గోలేటిలో పనిచేస్తున్న కోల్ ట్రాన్స్‌పోర్ట్ కార్మికులైన లారీ డ్రైవర్లు, క్లీనర్లు స్వచ్ఛందంగా విధులు బహిష్కరించారని తెలిపారు. యాజమాన్యం ఇప్పటికైనా ఒప్పందాన్ని అమలు చేసి పెండింగ్ వేతనాలు చెల్లించడంతో పాటు కార్మికులకు ఈపీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ, బోనస్ వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు వెంకటేష్, మనోహర్, ప్రశాంత్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి సభ్యత్వ నమోదు కేంద్రం ప్రారంభం



**మంచిర్యాల, 16,మే (ప్రజా జ్యోతి):** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి తెలంగాణ రాష్ట్ర శాఖ స్టేట్ చైర్మన్, గవర్నర్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్ ఆదేశాల మేరకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి మంచిర్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సభ్యత్వ నమోదు కార్యక్రమా న్ని ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ శనివారం కలెక్టర్ కార్యాలయం ఎన్నికల విభాగం (జి -33)లో ఏర్పాటు చేసిన స్పెషల్ మెంబర్ షిప్ డ్రైవ్ సభ్యుల నమోదు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రెడ్ క్రాస్ సేవా కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. సమాజ సేవ పట్ల ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ రెడ్ క్రాస్ సభ్యత్వాన్ని తీసుకుని సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య ఐఏఎస్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ దుర్గం క్రాంతి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి మంచిర్యాల జిల్లా శాఖ జనరల్ సెక్రటరీ చందూరి మహేందర్, స్టేట్ ఎం.సి. సభ్యులు వి. మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డెంగ్యూపై అవగాహన ర్యాలీ



**మంచిర్యాలరూరల్ మే16(ప్రజాజ్యోతి)** జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా మంచిర్యాల జిల్లా నస్పూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అరుణక్కనగర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. ఎస్. అనిత, కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య, కార్పొరేటర్ వేల్పుల రవీందర్ ప్రారంభించారు. డెంగ్యూ, మలేరియా వంటి కీటక జనిత వ్యాధులు ప్రబల కుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యారంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

**ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యే ధ్యేయం**

**: అదనపు కలెక్టర్ యువరాజ్**



**ఆసిఫాబాద్ మే 16 ప్రజా జ్యోతి** ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, ప్రభుత్వ విద్యా సంస్థలను అభివృద్ధి చేస్తూ విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించే దిశగా కృషి చేస్తోందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా చేపట్టిన విద్యా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన "కళా నైపుణ్య, సాంస్కృతిక దినోత్సవం" – కళాయవనిక కార్యక్రమానికి అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టి సకల సదుపాయాలతో నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో విద్యతో పాటు నైపుణ్యాలు, భాషా పరిజ్ఞానం, క్రీడలు వ్యక్తిగత విజయానికి పునాదులన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సృజనాత్మక రంగాలలో రాణించాలని, సామాజిక సేవను బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పిస్తూ నిష్ణాతులైన ఉపాధ్యాయుల బోధనతో ఫలితాలు అద్భుతంగా వస్తున్నాయని, ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల వైపు విద్యార్థులు అడుగులు వేస్తున్నారని తెలిపారు. విద్యార్థులు ప్రదర్శించిన హస్తకళలు, చిత్రలేఖనాలు, సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## "గడప లోపలే కులం -- గడప దాటితే మనమంతా హిందువులం"

**రేపు మంచిర్యాలలో భారీ హిందూ సమ్మేళనం**



**మంచిర్యాల, 16, మే (ప్రజా జ్యోతి):** మంచిర్యాల పట్టణంలో ఆదివారం భారీ హిందూ సమ్మేళనం నిర్వహించనున్నట్లు హిందూ సమ్మేళన సమితి ప్రతినిధులు తెలిపారు. హిందూ సమాజ ఐక్యత, సంస్కృతి పరిరక్షణ మరియు సమాజ చైతన్యమే కార్యక్రమ ప్రధాన లక్ష్యమని అన్నారు. "గడప లోపలే కులం -- గడప దాటితే మనమంతా హిందువులం" అనే నినాదంతో నిర్వహిస్తున్న ఈ సమ్మేళనానికి హమాలివాడ, రాజీవ్ నగర్, గోపాల్‌వాడ, దొరగారిపల్లి, తిలక్‌నగర్, సూర్యనగర్, చున్నంబట్టివాడ, అశోక్ రోడ్, భగవంతం వాడ ప్రాంతాల హిందూ బంధువులు కుటుంబ సమేతంగా హాజరుకావాలని నిర్వాహకులు కోరారు. ఈ దేశానికి ఆత్మ హిందూ ధర్మం, హిందూ సంస్కృతేనని, ప్రస్తుత కాలంలో ఎదురవుతున్న అనేక సవాళ్లను ఎదుర్కోవడానికి హిందూ సమాజ ఐక్యత అవసరమని తెలిపారు. దేశాన్ని విశ్వగురువుగా నిలబెట్టే లక్ష్యంతో సమాజాన్ని చైతన్యవంతం చేయడం కోసం ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు . ఈ కార్యక్రమం మే 17న ఆదివారం సాయంత్రం 6 గంటలకు శివాజీ గ్రౌండ్, పోచమ్మ చెరువు కట్ట వద్దనున్న నాగదేవత గుడి ప్రాంగణంలో జరగనుంది. ఈ కార్యక్రమానికి ప్రముఖ యోగ గురువు గర్భిష్ఠ శ్రీనివాస్ రెడ్డి సభాధ్యక్షులుగా వ్యవహరించనుండగా, మందమర్రి లోని శ్రీ కామాఖ్య పీఠానికి చెందిన మంతెన సతీష్ భవాని స్వామి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. కరీంనగర్ విభాగ్ ప్రచార ప్రముఖ్ శ్రీతడిగొప్పుల శంకరయ్య ప్రధాన వక్తగా, సరస్వతి విద్యాపీఠం విభాగ్ కార్యకారిణి సభ్యురాలు చందా వింధ్య మహిళా వక్తగా ప్రసంగించనున్నారు. కార్యక్రమం అనంతరం భోజన వసతి కూడా ఏర్పాటు చేసినట్లు 2 టౌన్ మంచిర్యాల హిందూ సమ్మేళన సమితి ప్రతినిధులు తెలిపారు.

## "ప్రజాజ్యోతి "కథనానికి స్పందించిన కమీషనర్



**మంచిర్యాలరూరల్ మే16(ప్రజాజ్యోతి)** మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కొనసాగుతున్న అక్రమ వెంచర్ వ్యవహారం పై ప్రజాజ్యోతి పత్రికలో ఈనెల 14న ప్రచురించిన "అధికారుల మౌనమే అక్రమ వెంచర్లకు బలం"అనే వార్తకు మంచిర్యాల కార్పొరేషన్ కమీషనర్ తో పాటుగా టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించారు. ప్రజాజ్యోతి కథనాన్ని సీరియస్‌గా తీసుకున్న మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి. అన్వేష్ అక్రమ వెంచర్ పై వెనువెంటనే విచారణ జరిపారు. అనంతరం అక్రమ వెంచర్ యాజమాన్యానికి నోటీసులు జారీ చేయడంతో పాటు వెంచర్‌లో ఏర్పాటు చేసిన ప్లాట్ల విభజన గుర్తులను తొలగించినట్లు కార్పొరేషన్ కమీషనర్ తెలిపారు. ఈచర్యతో అక్రమ వెంచర్లపై మున్సిపల్ అధికారులు ఉక్కుపాదం మోపారని స్థానికులు అభిప్రాయపడ్డారు. ఈ సమస్యపై వెంటనే స్పందించి చర్యలు తీసుకున్న కమిషనర్ జి.అన్వేష్‌తో పాటు టౌన్ ప్లానింగ్ అధికారులను స్థానిక ప్రజలు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

## సీఎంపీఎఫ్‌ఓ గోదావరిఖనిలో పెండింగ్‌లో ఉన్న పెన్షన్ క్లెయిమ్స్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలి

**ఆళవందార్ వేణుమాధవ్, సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి**



**మంచిర్యాల, 16 ,మే (ప్రజా జ్యోతి):** గోదావరిఖని సీఎంపీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో రిటైర్డ్ ఉద్యోగులు, వితంతువుల సాధారణ కోల్ మైన్స్ పెన్షన్ క్లెయిమ్స్ గత రెండు నుంచి మూడు నెలలుగా పెండింగ్ లో ఉన్నాయని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణుమాధవ్ తెలిపారు. పెన్షన్ క్లెయిమ్స్ పరిష్కారానికి అవసరం లేకపోయినా 8 నుంచి 10 సంవత్సరాల నోటిషనల్ వేతన వివరాలను సీఎంపీఎఫ్ అధికారులు కోరుతున్నారని ఆయన పేర్కొన్నారు. వాస్తవానికి ఉద్యోగ విరమణ తేదీ నుంచి కేవలం 10 నెలల నోటిషనల్ వేతన వివరాలు మాత్రమే సరిపోతాయని, ఇదే విధానం ఇప్పటివరకు గోదావరిఖని సీఎంపీఎఫ్ ప్రాంతీయ కార్యాలయం సహా ఇతర ప్రాంతాల్లో అమలులో ఉన్నదని తెలిపారు. అధికారుల కొత్త విధానం కారణంగా రిటైర్డ్ ఉద్యోగులు, వితంతువులు తీవ్ర అసంతృప్తికి గురవుతూ సీఎంపీఎఫ్ కార్యాలయం, సింగరేణి కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రిటైర్డ్ ఉద్యోగులు, వితంతువులు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని, గతంలో అమలులో ఉన్న విధానాన్నే కొనసాగిస్తూ పెండింగ్‌లో ఉన్న పెన్షన్ క్లెయిమ్స్‌ను వెంటనే పరిష్కరించాలని సీఎంపీఎఫ్ అధికారులను విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు.తక్షణమే ఈ పెన్షన్ క్లెయిమ్స్ పరిష్కారం కాకపోతే, ఈ విషయాన్ని ఉన్నత స్థాయిలో ప్రస్తావించాల్సి వస్తుందని ఆళవందార్ వేణుమాధవ్ అన్నారు .

## తెలంగాణ ఓబీసీ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా గాజుల ముకేశ్ గౌడ్ ఎన్నిక

**శాలువాతో సత్కరించిన బీజేపీ నాయకులు**



**మంచిర్యాల, 16, మే (ప్రజా జ్యోతి):** తెలంగాణ ఓబీసీ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా ఎన్నికైన గాజుల ముకేశ్ గౌడ్ ను శనివారం మంచిర్యాల పట్టణంలోని ఆయన నివాసంలో కోటపల్లి మండలం బీజేపీ పార్టీ మాజీ అధ్యక్షులు మంత్రి రామయ్య, బీజేపీ నాయకులు కండె ఓంనమశ్శివాయ లు కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి గాజుల ముకేశ్ గౌడ్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఓబీసీ వర్గాల అభివృద్ధి కోసం ఆయన మరింత కృషి చేసి పార్టీకి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని గాజుల ముకేశ్ గౌడ్ కు శుభాకాంక్షలు తెలిపారు.

# శ్లోకాలు, యోగా, ధ్యానం అంశాల పై శిక్షణ ఎంతో ఉపయోగకరము

### శ్రీరాంపూర్ ఏరియా జి.ఎం. సతీమణి, సేవా అధ్యక్షురాలు శ్రీమతి ఉమారాణి శ్రీనివాస్ ఘనంగా " ప్రజ్ఞ " కార్యక్రమ ముగింపు వేడుకలు



**మంచిర్యాల, మే 16 (ప్రజా జ్యోతి):** శ్లోకాలు, యోగా, ధ్యానం వంటి అంశాలపై శిక్షణ ఇవ్వడం ఎంతో ఉపయోగకరమని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ సతీమణి, సేవా అధ్యక్షురాలు శ్రీమతి ఉమారాణి శ్రీనివాస్ కొనియాడారు. వికాసతరంగిణి మంచిర్యాల శాఖ ఆధ్వర్యంలో గత 11 రోజులుగా 5 నుంచి 15 సంవత్సరాల వయస్సు గల బాల,బాలికలకు నిర్వహించిన "ప్రజ్ఞ" కార్యక్రమం ముగింపు వేడుకలు జెట్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం శ్రీ శ్రీ శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చిన జీయర్ స్వామి వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో రూపొందించబడింది. ఈ కార్యక్రమానికి మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ సతీమణి, సేవా అధ్యక్షురాలు శ్రీమతి ఉమారాణి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, శ్రీమతి సత్యప్రియ సాగర్ రావు ( మందమర్రి) , షేర్ పవన్‌లు విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. వికాసతరంగిణి మంచిర్యాల జిల్లా అధ్యక్షులు హన్మంతరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి శ్రీమతి ఉమారాణి శ్రీనివాస్ మాట్లాడుతూ, వికాసతరంగిణి మంచిర్యాల శాఖవారు అనేక మంచి కార్యక్రమాలను నిర్వహిస్తు న్నారని అభినందించారు. పిల్లల్లో భక్తిభావం పెంపొందించడంతో పాటు రామాయణం, మహాభారతాల పట్ల అవగాహన కల్పించడం, ఉదయం--సాయంత్రం తప్పక పఠించవలసిన శ్లోకాల గురించి వివరించడం, భగవద్గీతపై అవగాహన కల్పించడం, యోగా, ధ్యానం వంటి అంశాలపై శిక్షణ ఇవ్వడం ఎంతో ఉపయోగకరన్నారు. కులమతాలకు అతీతంగా ఇలాంటి కార్యక్రమాలను రూపొందించిన శ్రీ శ్రీ శ్రీ త్రిదండి రామానుజ చిన జీయర్ స్వామి వారికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం శిక్షణ ఇచ్చిన వికాసతరంగిణి కార్యకర్తలు, శిక్షకులను శాలువాలు, మెమెంటోలతో సత్కరించారు. విశిష్ట అతిథి షేర్ పవన్ మాట్లాడుతూ, పిల్లలకు వేసవి సెలవుల్లో చక్కటి విజ్ఞానాత్మక కార్యక్రమాన్ని రూపొందించిన వికాసతరంగిణి శాఖ నిర్వాహకులను అభినందించారు. వికాసతరంగిణి అధ్యక్షులు హన్మంతరావు మాట్లాడుతూ, సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. "ప్రజ్ఞ" కార్యక్రమానికి పిల్లలను పంపిన తల్లిదండ్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. శ్రీ జీయర్ స్వామి ఆజ్ఞ మేరకు హైదరాబాద్ నుండి స్వచ్ఛందంగా వచ్చి పిల్లలకు శ్లోకాలు, ప్రాతఃస్మరణీయాలు, భక్తిభావం, తల్లిదండ్రుల పట్ల పిల్లలు ఎలా ఉండాలనే అంశాలపై శిక్షణ ఇచ్చిన శ్రీమతి విజయలక్ష్మి సంపత్ కుమార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమానికి సహకరించిన వికాసతరంగిణి కార్యకర్తలు భాస్కర్‌రావు, చంద్రశేఖర్, ప్రేమలత, రుద్రమదేవి, హరనాథ్, శ్రీనివాస్, లీల తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమ సమన్వయకర్త, శిక్షకురాలు శ్రీమతి జ్యోత్స్న చంద్రదత్‌తో పాటు నిర్వాహకులు శ్రీమతి ఉమ, సునీత, శిక్షకులు అంజలి, మంజుల, చైతన్య సుధ, పి. విజయలక్ష్మిల సేవలను కొనియాడారు. అలాగే కార్యక్రమానికి సహకరించిన నిర్వాహక కమిటీ సభ్యులు రాజేశ్వర్‌రావు, నర్సింగరావు, భాస్కర్‌రావు, సంత్ ఉమలకు ధన్యవాదాలు తెలిపారు. తదనంతరం నిర్వహించిన క్విజ్ పోటీలలో విజేతలైన బాలబాలికలకు అతిథులు బహుమతులు అందజేశారు.

# వరుస క్రమలోనే వడ్ల తూకం!

- అదనపు కలెక్టర్ చంద్రయ్య స్పష్టీకరణ
- మండలంలో కొనుగోలు కేంద్రాల తనిఖీ



**దండేపల్లి, మే 16(ప్రజాజ్యోతి):** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలకు తావులేకుండా, రైతుల సీరియల్ నంబర్ ప్రకారమే తూకం ప్రక్రియ నిర్వహించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) చంద్రయ్య ఆదేశించారు. శనివారం మండలంలోని కన్నెపల్లి, గూడెం, నంబాల, వెల్గనూరు గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మండలంలోని సైతం లెక్కచేయకుండా సుమారు రెండు గంటల పాటు కేంద్రాల్లోనే ఉండి రైతులతో మాట్లాడారు.

**అక్రమాలపై ఆగ్రహం:**

వెల్గనూరులో నిబంధనలకు విరుద్ధంగా తమకు తెలిసిన వారికి, బంధువులకు ముందుగా తూకం వేస్తున్నారని రైతులు ఫిర్యాదు చేయగా.. అదనపు కలెక్టర్ తీవ్రంగా స్పందించారు. "ముందు వచ్చిన వారికి ప్రాధాన్యత ఇవ్వాల్సిందే.. ఇందులో పక్షపాతానికి తావులేదు. నిబంధనలు అతిక్రమిస్తే కేంద్రం నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటాం" అని హెచ్చరించారు.

**తరలింపులో వేగం పెంచాలి:**

తూకం వేసిన ధాన్యం బస్తాలను ఎప్పటికప్పుడు లింగాపూర్ గోదాములకు తరలించాలని ఐకేపీ సిబ్బందిని ఆదేశించారు. లారీల కొరత లేకుండా చూడాలని, రోజుకు కనీసం 50 లారీలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని అక్కడికక్కడే కాంట్రాక్టర్‌కు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. తగినంత మంది హమాలీలను ఏర్పాటు చేసుకుని రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు.?ఈ కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీవో, ఐకేపీ ఏపీఎం పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ప్రకృతి మిత్ర”లో విరబూసిన అరుదైన మే పుష్పం

## ఇంటి పరిసరాల్లో పెంచితే ఆహ్లాదం -- ఆనందం గుండేటి యోగేశ్వర్, పర్యావరణవేత్త

**మంచిర్యాల, 16, మే (ప్రజా జ్యోతి):** మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ రోడ్డులోని టీఎన్జీవోస్ కాలనీలో ఉన్న “ప్రకృతి మిత్ర” నిలయంలో శనివారం అరుదైన “మే పుష్పం” ఒకే మొక్కకు రెండు పుష్పాలు విరబూసి చూపరులను ఆకట్టుకుంటున్నాయి. వేసవి కాలంలో మాత్రమే సంవత్సరానికి ఒక్కసారి, అదీ కొన్ని రోజుల పాటు మాత్రమే వికసించే ఈ అరుదైన పుష్పం శాస్త్రీయ నామం స్కాడోక్సుస్ మల్టీఫ్లోరస్ . దీనిని సాధారణంగా “ఫుట్‌బాల్ లిల్లీ” లేదా “బ్లడ్ లిల్లీ” అని కూడా పిలుస్తారు. ఈ పువ్వు గుండ్రని బంతిలా, ఫుట్‌బాల్ ఆకారంలో ఎరుపు రంగులో మెరిసిపోతూ ఉంటుంది. చిన్న చిన్న పువ్వులు కలిసి ఒక పెద్ద గుత్తిలా ఏర్పడి చూడటానికి ఎంతో విశిష్టంగా, ఆకర్షణీయంగా కనిపిస్తాయి. ఎండలు ఎక్కువగా ఉండే మే నెలలో మాత్రమే ఈ పుష్పాలు వికసించడం విశేషం. అందుకే దీనికి “మే ఫ్లవర్” అనే పేరు వచ్చింది. ఈ మొక్క ఏడాది పొడవునా ఆకులతో మాత్రమే ఉంటుంది. అయితే వేసవి ప్రారంభంలో ఆకులు లేకుండానే నేలలోని దుంప నుంచి నేరుగా కాండం పైకి వచ్చి పుష్పం వికసిస్తుంది. కేవలం ఇరవై రోజుల పాటు మాత్రమే దీని జీవన కాలం ఉండటం ప్రత్యేకత. ఇది లిల్లీ జాతికి చెందిన దుంప మొక్క. నేలలోని దుంప ద్వారానే పెరుగుతుంది. చుట్టూ ఎండలు మండుతున్న సమయంలో కూడా, ప్రత్యేక నీటి వసతి లేకుండానే తనలోని తేమతో అద్భుతంగా వికసించడం ఈ పుష్పం ప్రత్యేక లక్షణంగా చెప్పవచ్చు. చూడటానికి అందంగా ఉండటమే కాకుండా సున్నితమైన సువాసనను కూడా వెదజల్లుతుంది. ఈ మొక్కలను ఆయుర్వేదం మరియు సాంప్రదాయ వైద్యంలో కొన్ని



రకాల చర్మ వ్యాధుల చికిత్సలో ఉపయోగిస్తారని, ఆకులను అలంకరణలకు వినియోగిస్తారని నిపుణులు చెబుతున్నారు. ఈ అరుదైన పుష్పం వికసించిన సమయంలో చూసేందుకు ప్రకృతి ప్రేమికులు ఆసక్తి చూపుతుంటారు. ఇంటి తోటల్లో ప్రత్యేక శ్రద్ధతో పెంచుకునే మొక్కలలో ఇది ఒకటిగా నిలుస్తోంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ “వాల్టా” అథారిటీ పర్యావరణవేత్త, “ప్రకృతి మిత్ర” పర్యావరణ సంస్థ వ్యవస్థాపకుడు గుండేటి యోగేశ్వర్ మాట్లాడుతూ, ఈ పుష్ప జాతిని కేరళ ప్రకృతి యాత్రలో సేకరించినట్లు తెలిపారు. దీనిని చూసిన మిత్రులు, ప్రకృతి ప్రేమికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. అరుదైన మొక్కలను ఇంట్లో పెంచడం వలన ఇంటికి అందం పెరగడమే కాకుండా, మానసిక ఆనందం, ఉత్సాహం, ప్రశాంతతను కలిగించే డోపమైన్, ఎండార్ఫిన్స్, సెరోటోనిన్ వంటి హార్మోన్లు విడుదలవుతాయని యోగేశ్వర్ వివరించారు.

# సేంద్రియ సాగుతోనే భూమి ఆరోగ్యం



**జైపూర్, మే 16 ప్రజా జ్యోతి** రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అలవాటు చేసుకొని భూమి సారాన్ని కాపాడాలని శాస్త్రవేత్త స్రవంతి సూచించారు. శనివారం ఇందారం గ్రామంలో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో ఆమె రైతులకు పలు వ్యవసాయ అంశాలపై అవగాహన కల్పించారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం చేపడితే దిగుబడులు మెరుగుపడటంతో పాటు నేల నాణ్యత కూడా నిలబడుతుందని తెలిపారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులకు ప్రాధాన్యత ఇవ్వాలని రైతులకు సూచించారు. పంట మార్పిడి విధానం అమలు చేయడం ద్వారా భూమిలో సారం పెరిగి, పంటలకు మేలు జరుగుతుందని వివరించారు. అలాగే వ్యవసాయంలో నీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని, నీటి వృథాను నివారించే పద్ధతులను రైతులు పాటించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఫయాజ్, ఉపసర్పంచ్ ఎల్కటూరి శివ, ఏఈఓ ప్రణీతతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# వేతనాలు చెల్లించాలని పంచాయతీ కార్మికుల వినతి

## ఎంపీడీవో కార్యాలయం వద్ద వినతిపత్రం అందజేత



**దండేపల్లి, మే 16(ప్రజాజ్యోతి):** మండలంలోని వివిధ గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు రెండు నెలలుగా నిలిచిపోయిన వేతనాలను తక్షణమే విడుదల చేయాలని కోరుతూ శనివారం ఎంపీడీవో, ఎంపీవోలకు కార్మికులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎండనక, వాననక గ్రామాల్లో పారిశుద్ధ్య పనులతో పాటు నిత్యం సేవలందిస్తున్న తమకు రెండు నెలలుగా జీతాలు అందకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలతో పాటు ఇతర సమస్యలను కూడా పరిష్కరించాలని అధికారులను కోరారు. దీనిపై స్పందించిన అధికారులు వేతనాల విడుదలకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.?ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కారొబార్లు ఉపారపు దినేష్ కుమార్, గొల్లపల్లి శ్రీనివాస్, నల్ల ప్రసాద్, పుట్టపాక రమేష్, తిరుపతి, శివమూర్తి మరియు ఇతర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ధాన్యం నిల్వపై నిఘా.. రైతులకు ఇబ్బందులు వద్దు

– ఆలీపూర్ గోదాములను తనిఖీ చేసిన మంచిర్యాల ఏసీపీ ప్రకాష్



**దండేపల్లి, మే 16(ప్రజాజ్యోతి):** మండలంలోని అల్లీపూర్ గ్రామంలో ధాన్యం నిల్వ చేస్తున్న గోదాములను మంచిర్యాల ఏసీపీ ప్రకాష్ శనివారం సందర్శించారు. లక్సెట్టిపేట సీఐ రమణమూర్తి తో కలిసి గోదాములను పరిశీలించిన ఆయన, నిల్వ సామర్థ్యం గిడ్డంగుల నిర్వహణ తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల నుంచి వస్తున్న ధాన్యం విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. గోదాముల వద్ద తగినన్ని గోనె సంచులు, వర్షం వస్తే ధాన్యం తడవకుండా ఉండేలా టార్పాలిన్లను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ధాన్యం సేకరణ, తరలింపు ప్రక్రియలో ఏదైనా శాంతిభద్రతల సమస్య తలెత్తినా లేదా ఇతర ఇబ్బందులు ఎదురైనా తక్షణమే పోలీసులను సంప్రదించాలని కోరారు. రైతుల శ్రేయస్సు దృష్ట్యా పోలీసు శాఖ ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దండేపల్లి ఎస్సై తహసీనుద్దీన్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యతో పాటు అన్ని రంగాలలో విద్యార్థులు రాణించాలి

మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, 16,మే (ప్రజా జ్యోతి):** విద్యార్థులు విద్యతోపాటు అన్ని రంగాలలో రాణించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహించిన విద్యా వారోత్సవాల్లో కళలు, హస్తకళలు, సాంస్కృతిక దినోత్సవ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. యాదయ్యతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యా వారోత్సవాలను నిర్వహిస్తోం దని తెలిపారు. కోలాటం, తోలుబొమ్మలాట, బొమ్మల ప్రదర్శన, పేరిణి శివతాండవం, ఒగ్గు కథ, లంబాడి, ఆదివాసీ నృత్యాలు, చిత్రలేఖనం, హస్తకళలు వంటి అంశాలలో విద్యార్థులు ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. కళలతో పాటు క్రీడా రంగంలో కూడా ప్రతిభ కనబరచాలన్నారు. వివిధ రంగాలలో నైపుణ్యత సాధించడం ద్వారా నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ అలవడటంతో పాటు టీం వర్క్‌పై అవగాహన పెరుగుతుందని తెలిపారు. ఏ రంగంలో అయినా గెలుపు, ఓటములు ముఖ్యంకాదని, ప్రయత్నించడం మొదటి విజయమని అన్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థుల కోసం ప్రత్యేక వేసవి శిబిరాలు నిర్వహిస్తూ, వివిధ అంశాలలో శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఉపాధ్యాయు లు తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు చేసిన ధాన్యం తరలింపునకు సరిపడా లారీలను కేటాయించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు**



**మంచిర్యాల, 16,మే (ప్రజా జ్యోతి):**ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం జిల్లాలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుంచి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామని, కొనుగోలు చేసిన ధాన్యం తరలింపునకు సరిపడా లారీలను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు ఆదేశించారు.నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఛాంబర్‌లో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళలతో కలిసి శనివారం వరి ధాన్యం రవాణాకు లారీలను కేటాయించే గుత్తేదారులతో సమీక్ష సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతుల వద్ద నుంచి తాలు, తప్ప, మట్టి గడ్డలు లేని, నిర్దేశిత తేమ శాతంతో కూడిన నాణ్యమైన ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేసి, కేటాయించిన రైస్ మిల్లులు మరియు గోదాములకు తరలిస్తున్నా మని తెలిపారు. ధాన్యం రవాణాలో ఎలాంటి అంతరాయం కలగకుండా గుత్తేదారులు తగిన లారీలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. లారీల కొరత కారణంగా ధాన్యం తరలింపులో ఇబ్బందులు తలెత్తితే సంబంధిత గుత్తేదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అనంతరం జైపూర్ మండలం కిష్టాపూర్ గ్రామంలోని ఐకేపీ, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల తహసీల్దార్ వనజా రెడ్డితో కలిసి సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.రైతుల వద్ద నుంచి ఎఫ్ఏక్యూ ప్రమాణాల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయాలని, కొనుగోలు కేంద్రాల్లో త్రాగునీరు, నీడ వంటి మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. రైతులకు అవగాహన కల్పించి తాలు, మట్టి గడ్డలు లేని ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలని తెలియజేయాలన్నారు. అలాగే కేంద్రాల్లో అందు బాటులో ఉన్న ప్యాడీ క్లీనర్లు, తేమ శాతం కొలిచే పరికరాలు, టార్పాలిన్లు తదితర పరికరాలను సమర్థంగా వినియోగించు కోవాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి

**నిజమైన ఓటరు ఓటు హక్కు కోల్పోరాదు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి**

**బీఎల్‌వోలకు సమగ్ర శిక్షణ ఇవ్వాలి -- ఓటరు ప్రోజెనీ మ్యాపింగ్ త్వరగా పూర్తి చేయాలి**







**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,మే 16 ,( ప్రజాజ్యోతి ).**స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను పూర్తి పారదర్శకతతో, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్ అమలు విధానంపై సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో చేపట్టబోయే ఎస్ఐఆర్ ప్రక్రియలో నిజమైన ఏ ఒక్క ఓటరు కూడా తమ ఓటు హక్కును కోల్పోకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం పెరిగేలా ప్రతి దశను పారదర్శకంగా నిర్వహించాలన్నారు.రాష్ట్ర ఎన్నికల షెడ్యూల్ ప్రకారం జూన్ 15 నుంచి 24 వరకు సన్నాహక చర్యలు, శిక్షణ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ మేరకు బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు), ఎన్నికల సిబ్బందికి పూర్తి స్థాయి శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఎస్ఐఆర్ నిబంధనలు, విధివిధానాలు, ఫీల్డ్ వెరిఫికేషన్, ఫారాల నిర్వహణ తదితర అంశాలపై స్పష్టమైన అవగాహన కల్పించాలని ఆదేశించారు. శిక్షణ కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని సూచించారు.ఓటరు ప్రోజెనీ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశించారు. మ్యాపింగ్‌లో ఎలాంటి పొరపాట్లు చోటు చేసుకోకుండా క్షేత్రస్థాయిలో జాగ్రత్తగా పరిశీలనలు చేపట్టాలని పేర్కొన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ అమలుకు అన్ని శాఖల అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. అధికారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఎన్నికల ప్రక్రియపై పూర్తి స్పష్టత కల్పిస్తామని తెలిపారు. ఓటరు ప్రోజెనీ మ్యాపింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మొత్తం ప్రక్రియ పారదర్శకంగా సాగాలని, బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలనలు నిర్వహించాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నందునాయక్.



**జన్నారం,మే16(ప్రజాజ్యోతి)** జన్నారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా జన్నారం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ,మాజీ సర్పంచ్ అజ్మీర నందు నాయక్, పట్టణ అధ్యక్షుడిగా పొనకల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు మంద రాజేష్ ను టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు వారికి మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి నియామక పత్రాలు అందచేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతన మండల అధ్యక్షుడు నందు నాయక్ పట్టణ అధ్యక్షుడు మంద రాజేష్ లు మాట్లాడుతూ తమ నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్యే బొజ్జు పటేల్ కి రుణపడి ఉంటామని, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి తమ వంతు కృషి చేస్తామని అన్నారు. నూతన మండల, పట్టణ అధ్యక్షులను కాంగ్రెస్ సీనియర్ నాయకులు తదితరులు అభినందించారు.

## రాష్ట్ర అవతరణ దినోత్సవానికి ముందే ఇందిరమ్మ ఇండ్ల పూర్తి లక్ష్యం

**నిర్మాణ పనులు వేగవంతం చేయాలి :ఎంపీడీఓ సత్యనారాయణ**



**జైపూర్, మే 16 : ప్రజా జ్యోతి** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసి లబ్ధిదారులు త్వరగా గృహప్రవేశాలు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని జైపూర్ ఎంపీడీఓ సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెలాఖరులోగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు పూర్తి చేసి, జూన్ 1 రాష్ట్ర అవతరణ దినోత్సవం నాటికి గృహప్రవేశాలు జరిగేలా కార్యాచరణ చేపట్టాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను గ్రామస్థాయిలో సమన్వయంతో అమలు చేయాలని సర్పంచులు, కార్యదర్శులకు దిశానిర్దేశం చేశారు.గ్రామాల్లో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఎన్ఎఫ్బీఎస్ పథకం కింద అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారి వివరాలను ఆన్లైన్లో నమోదు చేయడంలో నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు.రెడ్‌క్రాస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గ్రామస్థాయిలో విస్తృతంగా చేపట్టాలని, ఉపాధి హామీ కూలీలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని అన్నారు. అలాగే ఉపాధి హామీ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి, ఎక్కువ సంఖ్యలో కూలీలు పనులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డీఈ మిషన్ భగీరథ విద్యాసాగర్,ఎంపీఓ శ్రీపతి బాపూరావు,ఏఈ హౌసింగ్ కాంక్ష,ఏపీఓ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## వరి కొనుగోళ్లలో జాప్యం వద్దు: అధికారులకు అదనపు కలెక్టర్ ఆదేశాలు



**జైపూర్, మే 16 : ప్రజా జ్యోతి** జైపూర్ మండలంలోని వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ రాములు అధికారులను ఆదేశించారు. శనివారం కిష్టపూర్‌లో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో ధాన్యం నిల్వలు, తూకం ప్రక్రియ, తరలింపు ఏర్పాట్లపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.రైతులు కేంద్రాలకు తీసుకొచ్చే ధాన్యం ఎక్కువ రోజుల పాటు నిల్వ ఉండకుండా వెంటనే కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. ఈ నెల 20వ తేదీ నాటికి కొనుగోళ్లు పూర్తయ్యేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు.ధాన్యం తరలింపులో మిల్లర్లు ఆలస్యం చేయకుండా సమయానికి లారీలను ఏర్పాటు చేసి అన్‌లోడింగ్ చేపట్టాలని పేర్కొన్నారు.కొనుగోళ్లలో అలసత్వం ప్రదర్శించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ పర్యటనలో తహసీల్దార్ వనజ,ఏపీఎం సంతోష్,ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## సింగరేణిలో హెచ్ఎంఎస్ భరోసా యాత్ర

**కార్మిక సమస్యల పరిష్కారమే లక్ష్యం**

**హెచ్ఎంఎస్ జనరల్ సెక్రెటరీ రియాజ్ అహ్మద్**




**మంచిర్యాల, 16,మే (ప్రజాజ్యోతి):**సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి హెచ్ ఎంఎస్ (హింద్ మజ్దూర్ సభ) ఆధ్వర్యంలో "తెలంగాణ రక్షణ సేన హెచ్ఎంఎస్ భరోసా యాత్ర" నిర్వహించనున్నారు. ఈ యాత్ర జూన్ 15 నుంచి 20వ తేదీ వరకు వివిధ సింగరేణి ఏరియాల్లో కొనసాగనుందని నాయకులు తెలిపారు. కార్మికుల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కార మార్గాలపై చర్యలు తీసుకునేందుకు యాత్రను చేపడుతున్నట్లు జేబీసీసీఐ సభ్యుడు రియాజ్ అహ్మద్ తెలిపారు. కార్మికులకు భరోసా కల్పిస్తూ వారి హక్కుల సాధన కోసం హెచ్ఎంఎస్ నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. మహిళా నాయకురాలు శ్రీమతి కవిత కూడా ఈ యాత్రలో పాల్గొని కార్మిక కుటుంబాలతో సమావేశమవుతారని వివరించారు.యాత్ర షెడ్యూల్ ప్రకారం జూన్ 15న బెల్లంపల్లి ఏరియా గోలేటి,ఖైరి గూడ ప్రాంతాల్లో, 16న మందమర్రి ఏరియా కాసిపేట్--వన్ఏ ఇన్‌క్లైన్‌లో, 17న శ్రీరాంపూర్ ఏరియాలోని ఐకే--వన్ఏ, ఐకే ఓసీపీ ప్రాంతాల్లో, 18న ఆర్జీ--1 పరిధిలోని జీడీకే--11 ఇన్‌క్లైన్‌లో, 19న ఆర్జీ--2 పరిధిలోని జీడీకే ఓసీపీ--3లో, 20న ఆర్జీ--3 పరిధిలోని ఏఎల్పీ ప్రాంతంలో భరోసా యాత్ర కొనసాగనుంది."ఒక్కటే మా ఆయుధం -- సమష్టితమే మా బలం" అనే నినాదంతో కార్మిక సంక్షేమం కోసం హెచ్ఎంఎస్ కృషి చేస్తోందని రియాజ్ అహ్మద్ తెలిపారు.

## సాంస్కృతిక పోటీలలో అక్కపెల్లి గూడ విద్యార్థుల ప్రతిభ.



**జన్నారం,మే16(ప్రజాజ్యోతి)**ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాల సందర్భంగా మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన సాంస్కృతిక పోటీలలో జన్నారం మండలంలోని అక్కపెల్లి గూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కోలాటం లో ప్రథమ స్థానం మరియు లంబాడా నృత్యంలో ద్వితీయ స్థానం సాధించారు. అజ్మీర కీర్తన, ముద్రకోల శివాని మరియు దారాజుల శ్రావణి జిల్లా విద్యాధికారి యాదయ్య చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. గెలుపొందిన విద్యార్థులను మండల విద్యాధికారి విజయకుమార్ అభినందించారు. ప్రథమ ద్వితీయ స్థానాన్ని పొందడానికి కృషిచేసిన డ్యాన్స్ మాస్టర్ వంశీని ప్రధానోపాధ్యాయులు జాజాల శ్రీనివాస్, ఉపాధ్యాయులు శెట్టి రాజశేఖర్, కరుణ,ఏఏ పీ ఎస్సీ ఛైర్మెన్ రమాదేవి లు అభినందించారు.

## ప్రధాని మోదీ పిలుపుకు మద్దతుగా ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర గౌడ్

**చెన్నూరు--మంచిర్యాల మధ్య సాయంత్రం బస్సుల కొరతపై ప్రయాణికుల ఆవేదన**



**మంచిర్యాల, 16, మే (ప్రజా జ్యోతి):** దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావాలంటే సాధ్యమైనంత వరకు డీజిల్, పెట్రోల్ వినియోగాన్ని తగ్గించాలని ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 10న జరిగిన బహిరంగ సభలో ఇచ్చిన పిలుపుకు మద్దతుగా భారతీయ జనతా పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర గౌడ్ శనివారం ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు.ఈ నెల 20, 21 తేదీల్లో నిర్వహించ బడనున్న జిల్లా ప్రశిక్షణ తరగతుల ఏర్పాట్లు, వసతులను పరిశీలించేందుకు చెన్నూరు నుంచి మంచిర్యాల జిల్లా కేంద్రానికి ప్రజా రవాణా వ్యవస్థ అయిన ఆర్టీసీ బస్సులో ప్రయాణించి ప్రజలకు సందేశం ఇచ్చారు.ఈ సందర్భంగా బస్సులో ప్రయాణిస్తున్న పలువురు ప్రయాణికులతో ఆయన మాట్లాడారు. సాయంత్రం ఆరు గంటల తర్వాత చెన్నూరు వైపు బస్సుల సౌకర్యం తక్కువగా ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఉద్యోగులు, విద్యార్థులు, సాధారణ ప్రజలు రాత్రి సమయంలో ప్రయాణించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని తెలిపారు. ప్రజల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని నగునూరి వెంకటేశ్వర గౌడ్ హామీ ఇచ్చారు. ప్రజా రవాణా వినియోగం పెరగడం ద్వారా ఇంధన ఆదాతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పాటు అందుతుందని బిజెపి జిల్లా అధ్యక్షులు తెలిపారు.

## ధాన్యం తరలింపులో ఆలస్యం వద్దు

**--అదనపుకలెక్టర్(రెవిన్యూ )వి.రాములు**



**మంచిర్యాలరూరల్ మే16(ప్రజాజ్యోతి)** రైతుల నుంచి కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులు,గోదాములకు తరలించేలా సరిపడా లారీలను అందుబాటులో ఉంచాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు గుత్తేదారులకు సూచించారు. నస్పూర్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు,రవాణాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం జైపూర్ మండలం కిష్టాపూర్‌లోని వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతులకు తాగునీరు,నీడ తదితర సదుపాయాలు కల్పించాలని అధికారులకు ఆదేశించారు. నాణ్యమైన ధాన్యాన్నే కొనుగోలు చేయాలని సూచించారు.

## రెడ్‌క్రాస్ సొసైటీని బలోపేతం చేయాలి

**సభ్యత్వ నమోదుకు ముందుకు రండి : కలెక్టర్ హరిత**



**ఆసిఫాబాద్ మే 17 ప్రజా జ్యోతి** జిల్లాలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీలో పెద్ద ఎత్తున సభ్యులను చేర్పించి సొసైటీని బలోపేతం చేయాలని కలెక్టర్ కే. హరిత పిలుపునిచ్చారు. శనివారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యత్వం, బలోపేతంపై అధికారులు, సొసైటీ సభ్యులతో నిర్వహించిన సమీక్ష సమావేశానికి అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) యువరాజ్ మర్మాట్, ఆర్డీవో లోకేశ్వర్ రావుతో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సొసైటీలో పాట్రన్‌గా సభ్యత్వానికి రూ.25,000, వైస్ పాట్రన్‌కు రూ.12,500, జీవితకాల సభ్యత్వానికి రూ.1,000, సంవత్సరకాల సభ్యత్వానికి రూ.100 రుసుము చెల్లించి సభ్యత్వం పొందాలన్నారు. జిల్లాలోని సర్పంచులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పరిశ్రమల యజమానులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, బార్ అసోసియేషన్ సభ్యులు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు, మండల స్థాయి అధికారులు, ప్రముఖులంతా రెడ్‌క్రాస్‌లో సభ్యత్వం తీసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ సభ్యత్వం తీసుకోవడం ద్వారా సొసైటీ బలోపేతమవుతుందని, ఆ దిశగా అధికారులు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

# అమరుడు కామ్రేడ్ ఎండీ మునీర్ ప్రథమ వర్ధంతి సభను విజయవంతం చేయాలి

**మందమర్రిలో పోస్టర్ల ఆవిష్కరణ**

**మంచిర్యాల, 16, మే ( ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి ):** అమరుడు కమ్యూనిస్టు వాది, ప్రముఖ పాత్రికేయుడు కామ్రేడ్ ఎండీ మునీర్ ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని ఈ నెల 25 న సోమవారం సాయంత్రం 5 గంటలకు మందమర్రి మార్కెట్ ప్రాంతంలోని వీటి అబ్రహం గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించ నున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం మందమర్రి ఏఐటీయూసీ యూనియన్ కార్యాలయంలో శనివారం ప్రెస్ మీట్ నిర్వహించి వర్ధంతి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, అమరజీవి కామ్రేడ్ వీటి అబ్రహం, ఎండీ మునీర్‌లకు ఘన నివాళుల ర్పిస్తూ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సభకు పాత మిత్రులు, శ్రేయోభిలాషులు, ప్రజాసంఘాలు, యూనియన్లు, రాజకీయ పార్టీలకు అతీతంగా అందరూ ఆహ్వానితులేనని అన్నారు. ఈ బహిరంగ సభకు ముఖ్య అతిథులుగా వాసిరెడ్డి సీతారామయ్య తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శైలేంద్ర సత్యానారాయణ, భీమనాథుని సుదర్శన్,



ప్రముఖ అడ్వకేట్ ఎండీ సాందాని, గూడూరి యాదిరెడ్డి, శతకోపం కిష్టయ్య, ఎండీ అబ్బాస్, బర్ల సదానందం, ఊరకొండ రాజశేఖర్, ఎగేటి రాజేశ్వరరావు, దొంతుల రాజ్యం, కలవల శ్రీనివాస్, పారిపెల్లి సంజీవ్, ములకలపల్లి వెంకటేశ్వర్లు, సట్ల కొండయ్య, శివాజీ శ్రీనివాస్, పాత్రికేయ మిత్రులు తదితరులు పాల్గొన్నారు. వర్ధంతి సభను విజయవంతం చేయాలని శైలేంద్ర సత్యనారాయణ, భీమనాథుని సుదర్శన్, గూడూరి యాదిరెడ్డి, ఎండీ సాందాని పిలుపునిచ్చారు.

# జిల్లాలో రౌడీయిజాన్ని కను మరుగు చేస్తాం

**ప్రతివారం రౌడీ షీటర్స్, సస్పెక్ట్ షీటర్ల పై తనిఖీలు పద్ధతి మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**
**జిల్లా ప్రజలకు ప్రశాంత వాతావరణం కల్పించడమే, నేర రహిత సమాజాన్ని నిర్మించడం లక్ష్యం**
**ఎలాంటి నేరాలకు, అసాంఘిక కార్యకలాపాలకు, బెదిరిం పులకు, దందాలకు పాల్పడ రాదు**
**పద్ధతి మార్చుకొని వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తాం జిల్లాలో ఇప్పటివరకు 6 గురి పై పిడి యాక్ట్ నమోదు**
**ప్రవర్తన మార్చుకొని కుటుంబ సభ్యులతో ఆనందంగా జీవించాలని సూచన**
**రౌడీ షీటర్లు సస్పెక్ట్ షీటర్లతో ఏ ఆర్ హెడ్ క్వార్టర్స్‌లో సమావేశం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**





**ఆదిలాబాద్ బ్యూరో, మే 16, (ప్రజా జ్యోతి)** రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లు ప్ర వర్తన మార్చుకోకపోతే అన్ని రకాలుగా అణచి వేస్తామని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ హెచ్చరించారు. శని వారం ఉదయం స్థానిక ఏ ఆ ర్ హెడ్ క్వార్టర్స్ లో జిల్లా లో ని రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్ల తో ఏర్పాటుచేసిన సమావే శంలో జిల్లా ఎస్పీ అఖిల్ మ హాజన్ పాల్గొని వారికి సూచ నలు చేశారు. రౌడీయిజం, గుండాయిజం ప్రజలను మో సం చేయడం, బెదిరించడం లాంటివి చేస్తే చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సత్ప్రవర్తన కలిగిన వారికి రౌడీషీట్లు తొల గించి సరైన న్యాయం చేస్తామని తెలిపారు. ఎట్టి పరిస్థితు ల్లోనూ ప్రజలను బెదిరించ డం, డబ్బులు వసూలు చే యడం, రౌడీయిజం చేయడం లాంటివి మానుకోవాలని సూచించారు. రౌడీ షీటర్ల పై ఉన్న కేసుల వివరాలను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తూ, నమోదైన కేసు లను న్యాయస్థానాల లో శిక్షలు పడేవిధంగా కృషి చేస్తూ బాధితులకు న్యాయం చేస్తా మని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా ప్రజలకు ప్రశాంత వాతా వరణం కల్పించడానికి తన వంతు పూర్తిస్థాయిలో కృషి చేయడం జరుగుతుందని తె లిపారు. రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లు ఉన్నా, మళ్ళీ తిరిగి గంజాయి దందా మట్కా దందా, రౌడీ ఇజం, హత్యలు, హత్యాయత్నాలు, నేరాలు, ప్రజలను బెదిరించడం కోట్లాటలు, గొడవలు, దొంగతనాలు, ల్యాండ్ మాఫియా, భూములను ఆక్రమించడం, నకిలీ పత్రాలను సృష్టించడం లాంటివి తిరిగి మొదలుపెట్టిన వారిపై పి డి యాక్టర్ నమోదుకు సైతం వెనకాడ బోనని హెచ్చరించా రు. అదేవిధంగా సోషల్ మీడి యాలో కత్తులతో పోస్టులు పెట్టడం, రెచ్చగొట్టడం, రౌడీ యిజాన్ని ప్రోత్సహిస్తూ ప్రజల ను భయభ్రాంతులను గురి చే యడం, లాంటివి చేస్తే సహిం చేది లేదని తెలిపారు. నేరాలు లేని సమాజాన్ని తయారు చేయడానికి జిల్లా పోలీస్ యంత్రాంగం అహర్నిశలు కృషి చేస్తుందని తెలిపారు. రాత్రి సమయాలలో అనవసరంగా బ యటకు తిరగవద్దని సూచిం చారు. జిల్లాలో గత సంవత్సరం 1300 పైగా రౌడీ షీట్స్ స స్పెక్ట్ షీట్స్ నమోదు అయి ఉండగా వాటిలో సత్ప్రవర్త నగా ఉన్న 500 షీట్స్ తొల గించడం జరిగిందని, నూతనంగా 300 జత చేసి పర్య వే క్షించడం జరుగుతుందని తెలిపారు. ప్రతివారం పోలీసులు పిలిచినప్పుడు, ఇంటికి వచ్చి నప్పుడు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, శిక్షణ ఐపీఎస్ రాహుల్ కాంత్, ఏఆర్ డీఎస్పీ కమతం ఇంద్రవర్ధన్, సిఐలు బిసునీల్ కుమార్, కె నాగరాజు, కే ఫణిధర్, కర్ర స్వామి, ఎస్సైలు వి ష్ణువర్ధన్, అశోక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 18వ తేదీ నుండి ప్రత్యేక కార్యక్రమాలు ప్రారంభం

**జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి హనుమంత రెడ్డి**



**మంచిర్యాల, 16, మే (ప్రజా జ్యోతి):** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి ప్రత్యేక కార్యక్రమాల ను నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి హనుమం త రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18 నుంచి 23 వరకు జిల్లాలో "యూత్ అండ్ స్పోర్ట్స్" థీమ్ కార్యక్రమాల భాగంగా యువతలో ఆరోగ్య చైతన్యం, క్రీడాస్ఫూర్తి, నాయకత్వ లక్షణాల అభివృద్ధి లక్ష్యంగా వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు. ఈ నెల 18 న ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు "ఫిట్ అండ్ యాక్టివ్ తెలంగాణ" కార్యక్రమం నిర్వహించ బడుతుందని తెలిపారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని ఐబి చౌరస్తా నుండి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల -- జిల్లా క్రీడాధికార సంస్థ మైదానం వరకు మరథాన్ నిర్వహించ నున్నట్లు తెలిపారు. యువతలో ఉత్సాహాన్ని నింపే విధంగా ఏరోబిక్స్, జుంబా డాన్స్ కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేయను న్నట్లు తెలిపారు. జిల్లాలోని యువత, విద్యార్థులు, క్రీడాకారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమా న్ని విజయవంతం చేయాలని హనుమంత రెడ్డి కోరారు.

## వాంకిడి లో డెంగ్యూ అవగాహన ర్యాలీ

**డెంగ్యూ రహిత సమాజమే మన ధ్యేయం**

**జాతీయ డెంగ్యూ దినోత్సవంలో వైద్యుల పిలుపు**



**ఆసిఫాబాద్ మే 16 ప్రజా జ్యోతి** జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా శుక్రవారం వాంకిడి ప్రభుత్వ ఆసుపత్రి నుంచి జాతీయ రహదారి వరకు ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అయేశా, హెచ్ఈవో రవిదాస్, డాక్టర్ రియాజ్ (ఎంఎల్‌హెచ్‌పీ) మాట్లాడుతూ డెంగ్యూ జ్వరం ఏడీస్ ఈజిప్టి దోమల ద్వారా వ్యాప్తి చెందుతుందన్నారు. తీవ్ర జ్వరం, తలనొప్పి, కీళ్లు, కండరాల నొప్పులు, చర్మంపై ఎర్రటి మచ్చలు, అలసట, నీరసం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. దోమల నివారణకు ప్రతి శు క్రవారం 'డ్రైడే' పాటించి ఇంటి పరిసరాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించాలని, డ్రమ్ములు, పూలకుండీలు శుభ్రపర్చాలని, దోమతెరలు వాడాలని కోరారు. పాత టైర్లు, కొబ్బరిబొండాలు, కుండ పెంకలు, పూలకుండీల కింద ప్లేట్లలో నీరు నిల్వ లేకుండా చూడాలని అవగాహన కల్పించారు. 'దోమల నివారణే మన లక్ష్యం, డెంగ్యూ రహిత సమాజమే మన ధ్యేయం'గా ప్రతి ఒక్కరూ పనిచేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజలు, పీహెచ్‌సీ, సీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

## మధుర నగర్ కాలనీలో తీరిన 'లో వోల్టేజ్' కష్టాలు



నేరడిగొండ, మే 16 ప్రజాజ్యోతి :మండల కేంద్రంలోని మధుర నగర్ కాలనీ వాసుల ఎన్నో ఏళ్ల లోవోల్టేజ్ సమస్యకు ఎట్టకేలకు మోక్షం లభించింది. కాలనీ ఏర్పాటైన నాటి నుండి ఇక్కడి ప్రజలు తీవ్రమైన లోవోల్టేజ్ సమస్యతో నరకం చూశారు. వోల్టేజ్ హెచ్చుతగ్గుల వల్ల ఎందరో పేదల టీవీలు, మోటార్లు, ఫ్రిడ్జ్‌లు, ఫ్యాన్లు కాలిపోయి తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లింది. ఈ సమస్యపై కాలనీ పెద్దలు గతంలో అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయింది.ఈ తీవ్ర సమస్యను సామాజిక కార్యకర్త, వార్డు సభ్యులు సాబ్లే సంతోష్ సింగ్ స్థానిక ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తో పాటు విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నిరంతరం అధికారులతో సమన్వయం చేస్తూ పట్టుబట్టడంతో సమస్య పరిష్కారానికి అడుగులు పడ్డాయి. దీనికి తోడు గ్రామ సర్పంచ్ ఏలేటి నీలిమ రవీందర్ రెడ్డి, ఉప సర్పంచ్ గోతి గులాబ్ సింగ్ లు ప్రత్యేక శ్రద్ధ పెట్టడంతో నెల రోజుల క్రితమే ఇక్కడ నూతన ట్రాన్స్‌ఫా ర్మర్‌ను మంజూరు చేయించి ఏర్పాటు చేశారు.నెల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినప్పటికీ సాంకేతిక కారణాల వల్ల కనెక్షన్ ఇవ్వలేదు. శనివారం సర్పంచ్ ఏలేటి నీలిమ రవీందర్ రెడ్డి, ఉప సర్పంచ్ గోతి గులాబ్ సింగ్, వార్డు సభ్యులు సాబ్లే సంతోష్ సింగ్ లు స్వయంగా విద్యుత్ శాఖ సిబ్బంది, కాంట్రాక్టర్లతో కలిసి విద్యుత్ కనెక్షన్ ఇప్పించి, ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రజల వినియోగంలోకి తీసుకువచ్చారు. ఎన్నో ఏళ్ల నాటి సమస్య పరిష్కారం కావడంతో మధుర నగర్ కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేస్తూ.. గ్రామ పంచాయతీ పాలకవర్గానికి, ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## లక్కంపూర్‌లో ఉచిత వైద్య శిబిరం



నేరడిగొండ, మే 16 (ప్రజాజ్యోతి):నేరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్ సి) పరిధిలోని లక్కంపూర్ గొండ్ గూడ గ్రామంలో శనివారం సార్వత్రిక రోగనిరోధక టీకాల కార్యక్రమం (యూనివర్సల్ ఇమ్యూనిజషన్ ప్రోగ్రామ్ ), ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ సెడ్మకి సుజాత గంగాధర్ ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు, పిల్లలకు రోగనిరోధక టీకాలు వేసి, అవసరమైన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ( హెచ్ ఈ ఓ ) పవార్ రవీందర్, ఏఎన్ఎం పవార్ అమ్మిబాయి, ఆశా కార్యకర్త రజిత, అంగన్‌వాడీ టీచర్ గోదావరి తదితరులు పాల్గొని వైద్య సేవలు అందించారు.

## పెంబి మండలంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బొజ్జు పటేల్, పాల్గొన్న ఎంపీ నగేష్



ఖానాపూర్(పెంబి) మే 16 (ప్రజా జ్యోతి)పెంబి మండలం నాగాపూర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెద్మ బొజ్జు పటేల్ పార్లమెంట్ సభ్యులు గేడం నగేష్ తో కలిసి శనివారం ప్రారంభించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో రైతులు , మహిళలు అనేక సంక్షేమ పతాకాలు పొందుతున్నారు అన్నారు.మహిళా సాధికారతే లక్ష్యంగా కాంగ్రెస్ సర్కార్ అభివృద్ధి చేస్తుంది అని , మహిళా సంఘాల ద్వారా రాష్ట్రంలో వరి కొనుగోలు కేంద్రాలు,ఆర్టీసీ బస్సులు,పెట్రోల్ బంక్ లు నడిపిస్తూ, వారికి స్వయం ఉపాధి కల్పిస్తున్నాం అన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మాజీ ద్,పెంబి సర్పంచ్ సత్యనారాయణ స్వామి కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు రాజు రా సత్యం పెంబి మండల పార్టీ అధ్యక్షులు గుడిసె రమేష్ అధికారులు కాంగ్రెస్ నాయకులు ఐకెపి మహిళా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ నిర్మూలన పేదరిక ఐకెపి సంస్థ సెర్ప్ డి ఆర్ డి ఏ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



సారంగాపూర్,మే 16,ప్రజా జ్యోతి మండలంలోని తాండ్ర. జి, వైకుంఠాపూర్ గ్రామల లో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఐకెపి ఆధ్వర్యంలో మండల మార్కెట్ చైర్మన్ అబ్దుల్ ఆది వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముందు మహిళలకు ఉచిత బస్సు,ఐకెపి సెంటర్లు కూడా మహిళల ద్వారానే వడ్ల కొనుగోలు జరపాలని ప్రభుత్వం నిర్ణయించిందని. రైతులు దళారులకు అమ్మకూడదని ప్రభుత్వం ఏర్పాటు చేసిన సెంటర్ లలో వడ్లు, మక్కాలు అమ్మాలని అన్నారు. ఏ గ్రేడ్ క్వింటాల్ ధర 2389 రూపాయలకు కామన్ గ్రేడ్ క్వింటాల్ ధర 2369, రూపాయలకు రైతులు అమ్ముకోవాలని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం సన్న రకం వరికి 500 రూపాయల బోనస్ ఇస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొప్పుల వెన్నెల, ఐకెపి ఏపీఎం మాధురీ, సీసీలు విగ్నేష్, భూమేష్,సాక్ పెల్లి సురేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు వంగ భూమారెడ్డి, రాహుల్, మార్కెట్ డైరెక్టర్ ప్రశాంత్,మధుకర్, సూర్యం, కరుణాకర్, దయానంద్,కుర్మే పెద్ద గంగన్న, కొడిమల గంగన్న గ్రామ వివో అధ్యక్షురాలు సాకాలి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కాలనీలోకరెంట్ స్తంభాల ఏర్పాటు



బోథ్, మే 17 (ప్రజా జ్యోతి) బోథ్ మండల కేంద్రం లోని 10 వ వార్డు లో ఎన్నో ఏళ్ల నుండి కరెంటు స్థంబాలు లేక కాలనీవాసులు అవస్థలు పడుతున్నారు. దీంతో విషయాన్ని కరెంట్ అధికారుల దృష్టికి వార్డు మెంబర్ కట్ట భూమేష్ తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన అధికారులు కట్ట భూమేష్ సహకారం తో కాలనీలో కరెంటు స్థంబాలు ఏర్పాటు చేశారు. కాలనీవాసులు హర్షాన్ని వ్యక్తం చేయడంతో పాటుగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ ఈ శ్రావణ్ కుమార్ లైన్ మెన్, రమేష్, సిబ్బంది శ్రీధర్.రాజు, షేఫీ,అజర్, తదితరులు పాల్గొన్నారు.

## కళలతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**సోఫీనగర్ గురుకులంలో ఘనంగా విద్యా వారోత్సవాలు**

**ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు**





నిర్మల్ జిల్లా ప్రతినిధి ,మే 16 ,( ప్రజా జ్యోతి ). సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పేర్కొన్నారు. శనివారం నిర్మల్ అర్బన్ మండలం సోఫీనగర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన విద్యా వారోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కళలు, హస్తకళలు, సాంస్కృతిక ప్రదర్శనలను కలెక్టర్ పరిశీలించి విద్యార్థులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు కళలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా చురుకుగా పాల్గొనాలని సూచించారు.విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు గుర్తించి ప్రోత్సహించాలని అన్నారు. ప్రస్తుత కాలంలో విద్యతో పాటు కళలు, సాంస్కృతిక రంగాల్లో కూడా విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. సెల్‌ఫోన్లకు దూరంగా ఉంటూ కొత్త విషయాలు నేర్చుకోవడంపై దృష్టి సారించాలని విద్యార్థులకు సూచించారు.కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కలెక్టర్ చేతుల మీదుగా జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, తహసిల్దార్ రాజు, ఎంఈఓ పద్మ, పాఠశాల ప్రిన్సిపల్ డానియల్, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సీడీఓ సమావేశం నిర్వహించిన జిల్లా పోలీసు అధికారులు



నిర్మల్ జిల్లా ప్రతినిధి ,మే 16 ,( ప్రజాజ్యోతి ).జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఆదేశాల మేరకు జిల్లాలోని పోలీస్ అధికారులు ప్రతీ వారం లాగే ఈ వారం కూడా తమ పోలీస్ స్టేషన్ కోర్టు డ్యూటీ ఆఫీసర్స్ తో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న కేసులు, అవైటెడ్ సి ,సీ నంబర్లు, సమన్లు,వారెంట్ల అమలు, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతి తదితర అంశాలపై అధికారులతో సీడీఓ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో కేసుల దర్యాప్తు వేగవంతం చేయడం, కోర్టుల నుండి రావాల్సిన సి ,సీ. నంబర్లను త్వరితగతిన పొందడం, సమన్లు మరియు నాన్-బెయిలబుల్ వారెంట్ల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు.అలాగే లాంగ్ పెండింగ్ కేసులను ప్రాధాన్యతగా తీసుకొని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కోర్టు సంబంధిత వ్యవహారాల్లో నిర్లక్ష్యం లేకుండా సమన్వయంతో పని చేయాలని సూచించారు.

## పెంచిన పెట్రోల్, డీజిల్ ధరల ను వెంటనే ఉపసంహరించు కోవాలి

సీపీఐ (ఎంఎల్ )మాస్ లైన్ జి ల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జ గన్ సింగ్




ఆదిలాబాద్ బ్యూరో , మే 16, (ప్రజా జ్యోతి) పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహ రించు కోవాలని సిపిఐ (ఎం ఎల్) మాస్ లైన్ జిల్లా కార్యద ర్శి వర్గ సభ్యులు జగన్ సింగ్ డిమాండ్ చేశారు. పెట్రోల్ డీజిల్ ధర ల పెంపు తో ప్రజ ల పై భారం పడ కుండా చూడాల ని డిమాండ్ చేశారు. శని వా రం ఆయన స్థానికంగా విలేక రులతో మాట్లాడుతూ పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించు కోవాలని, ఈ ధరలు పెరగడం ద్వారా సామాన్య ప్రజలపై భా రం పెరిగే అవకాశం ఉందని అన్నారు. గతంలో కేంద్ర మం త్రులు మాట్లాడుతూ మా ప్ర భుత్వంలో ఎటువంటి భారా న్ని ప్రజలపై వేయమని, ధర లు పెంచబోమని మాటలు చె ప్పి పది రోజులు కాకుండానే వెంటనే గ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరలను అమాంతం పెంచు తూ ప్రజల నడ్డి విరిచే విధం గా కేంద్ర ప్రభుత్వం వ్యవస్థ ఉ న్నదని అన్నారు. డీజిల్, పెట్రో ల్, గ్యాస్ ధరలు పెరగడం ద్వారా నిత్యవసర వస్తువుల ధరలను సామాన్యునికి అంద రికి ధరలు పెరిగే అవకాశం ఉందని, వెంటనే ధరలు తగ్గిం చి పేద ప్రజలకు న్యాయం చే యాలని డిమాండ్ చేశారు.

## సోనాల మండల నూతన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షున్ని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు



సోనాల మే 16 : (ప్రజాజ్యోతి) ఇటీవలే కాంగ్రెస్ పార్టీ సొనాల మండల నూతన అధ్యక్షులుగా నియమితులైనటువంటి గాజుల పోతన్నను కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి, వారిని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కష్టపడ్డ కార్యకర్తలను గుర్తించి మండల అధ్యక్ష బాధ్యతలను ఇచ్చినందు కు చాలా సంతోషంగా ఉందని, కష్టపడ్డ కార్యకర్తలను గుర్తించి పదవులు ఇచ్చినందుకుగాను, కాంగ్రెస్ పార్టీ పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, డిసిసి అధ్యక్షులు నరేష్ జాదవ్, మాజీ ఎంపీ సోయం బాపూరావు, అదేవిధంగా నాయకులు ఏలేటి అశ్విన్ రెడ్డి నియోజకవర్గ ఇన్చార్జ్ ఆడే గజేందర్ గార్లకు ధన్యవాదాలు తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో నాయకులు చెట్ల పెల్లి అనిల్, సీనియర్ నాయకులు కసిరె పోతన్న , ప్రకాష్, పవన్, రామచందర్, కాకాజీ, అమృత్ రావ్, పవన్, సాగర్, పరశురాం, శంకర్, చంద్రకాంత్, శ్రీను, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

## ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాత..

బీజేపీ అసలు రంగు బయటపడింది

ఆదిలాబాద్ జిల్లా యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ శ్రీకర్ గౌడ్ మండిపాటు



గుడిహత్నూర్ మే 16, (ప్రజా జ్యోతి) : పెట్రోలు, డీజిల్ ధరల పెంపుపై ఆదిలాబాద్ జిల్లా యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ శ్రీకర్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల తర్వాత బీజేపీ, కేంద్ర ఎన్డీఏ ప్రభుత్వం అసలు రంగు బయట పడిందని ఆయన మండిపడ్డారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ఫలితాల అనంతరం కేంద్రం పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతున్నట్లు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయని, అవన్నీ పుకార్లు మాత్రమేనని వీటిని ప్రజలు నమ్మవద్దని ప్రకటించి, వాటిని నిజం చేస్తూ ధరలను పెంచడం దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని ఆయన మండిపడ్డారు. సామాన్య ప్రజలను మోసం చేయడమే లక్ష్యంగా బీజేపీ రాజకీ యం సాగుతోందని ఆయన ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో, పండగ ఆఫర్ల పేరుతో రేట్లు తగ్గించి, కేంద్ర ప్రభుత్వం అందరినీ ఆకర్షిస్తుం దని, జనం అంతా నమ్మి కొనుగోలు చేసిన తర్వాత, ఒక్కసారిగా ఆఫర్లు తీసేసి, మునుపటి కంటే రెట్టింపు ధరలను పెంచి పేదల నడ్డి విరుస్తుందని ఆయన విమర్శించా రు. కేంద్రం సామాన్యుల జీవితాలతో చెలగాటమాడు తుందని దుయ్యబట్టారు. చదువు కున్న యువత, సామాన్య ప్రజలు బీజేపీ దోపిడీని గమనించాలన్నా రు. ఎన్డీఏ ప్రభుత్వం దేశ ప్రజలను నమ్మించి తడి గుడ్డతో గొంతు కోసిందన్నారు. బీజేపీ అవలంభిస్తున్న ద్వంద్వ వైఖరి, వారి విధానాలను ఎప్పటికప్పుడు కాంగ్రెస్ పార్టీ ఎండగడుతూనే ఉంటుందని చెప్పారు.సామాన్యులపై భారం పడకుండా, పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు.

## బజార్హత్నూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సంబంధించిన పెండింగ్ నిధులను విడుదల

ఆదిలాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్


JUPALLY KRISHNA RAO

Dear Sandeep Kumar Sultania IAS Garu,

Sub:- Request for release of funds against Token Numbers - Reg.

| Sl. No. | Token Number | Amount in Rs. |
| --- | --- | --- |
| 1 | [illegible] | Rs. 1,57,717 |
| 2 | [illegible] | Rs. 1,52,341 |

With regards,

(JUPALLY KRISHNA RAO)

To,
Sri Sandeep Kumar Sultania IAS,
Principal Secretary to Government,
Finance & Planning Department
Government of Telangana,
Hyderabad.

బజార్హత్నూర్ మే 16, (ప్రజా జ్యోతి)ఆదిలాబాద్ జిల్లా బజార్హత్నూర్ మం డల కేంద్రంలోని సర్కారు బడి బాలికల కోసం మరుగుదొడ్లు నిర్మించేం దుకు పుస్తెలు తాకట్టు పె ట్టి అప్పుల పాలైన మహి ళా దీనావస్థ పై ఈనాడు లో ప్రచురితమైన కథనానికి స్పందించి శని వారం ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ చొరవతో ఆదిలాబాద్ ఇంచార్జి మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు తో మాట్లాడి ఆమెకు చెల్లించాల్సిన బిల్లులను విడుదల చేయాలనీ టోకెన్ నెంబర్ లు జారిచేయించారు.పాఠశాలలో బాలికల మరుగుదొడ్ల నిర్మాణం కోసం పెండింగ్‌లో ఉన్న టోకెన్ నంబర్లకు సంబంధించి రూ. 1,57,717 మరియు రూ. 1,52,341 నిధులు మంజూరు చేయించడంతో పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందిందని స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా జిల్లా ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## కాంగ్రెస్ మండల కన్వీనర్ రాజశేఖర్ రెడ్డికి ఘన సన్మానం



నేరడిగొండ, మే 16 (ప్రజా జ్యోతి):మండల కాంగ్రెస్ పార్టీ నూతన కన్వీనర్‌గా నియమితులైన ఏలేటి రాజశేఖర్ రెడ్డిని జిల్లా, మండల పార్టీ నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో ఆయనకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి శు భాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా పార్టీ ముఖ్య నాయకు లు మాట్లాడుతూ.. మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి రాజశేఖర్ రెడ్డి నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు. అందరినీ సమన్వయం చేసుకుంటూ, ప్రభుత్వ సంక్షేమ పథకాల ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించాలని కోరారు.ఈ సన్మాన కార్యక్రమంలో డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆడే వసంత్ రావ్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రఫుల్ చందర్ రెడ్డి, డీసీసీ జిల్లా సెక్రటరీ అగ్గు రమేష్, జాదవ్ వసంత్ రావ్, సర్పంచ్‌లు సోలంకి జితేందర్, మధుకర్, మాజీ సర్పంచ్ జనార్దన్ పాల్గొన్నారు. అలాగే పార్టీ నాయకులు నారాయణ్ గౌడ్, భాస్కర్ రెడ్డి, నరేష్ రెడ్డి, నారాయణ రెడ్డి, రాథోడ్ వసంత్ రావ్, జాదవ్ కపిల్ దేవ్, ఆడే రమేష్, గట్టు అశోక్, మహిపాల్, లక్ష్మన్ గౌడ్, సాబ్లె కైలాష్, బ్రహ్మయ్య, మురళి తదితరులు పాల్గొని రాజశేఖర్ రెడ్డిని అభినందించారు.

# సర్పంచ్ - కలెక్టర్ చొరవ
# మంటలు ఆర్పిన ఫైర్ సిబ్బంది



**నేరడిగొండ, మే 16 (ప్రజాజ్యోతి):**మండలంలోని కుమారి గ్రామంలో శనివారం తృటిలో ఒక పెను ప్రమాదం తప్పింది. పంట పొలాల్లో రైతులు పెట్టిన మంటలు, ఒక్కసారిగా వీచిన ఈదురు గాలుల కారణంగా పక్కనే ఉన్న చేలకు వేగంగా వ్యాపించాయి. అక్కడ పూర్తిగా ఎండిపోయి ఉన్న మొక్కజొన్న, జొన్న బెండుకు మంటలు అంటుకోవడంతో క్షణాల వ్యవధిలోనే పశుగ్రాసం మొత్తం అగ్నికి ఆహుతై, బూడిదగా మారింది.అదే సమయంలో పొలాల్లో కల్లాలపైన జొన్నలు, మొక్కజొన్నలను ఎండబోసుకున్న రైతులు ఎక్కడ తమ కష్టార్జితం బుగ్గిపాలు అయిపోతుందోనని తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించి, దాదాపు ఆరు గంటల పాటు ప్రాణాలకు తెగించి మంటలను చల్లార్చేందుకు శ్రమించారు. అయితే, మొదట వచ్చిన ఫైర్ ఇంజన్ సిబ్బంది మంటలను అదుపు చేయడానికి ఎంత ప్రయత్నించినా అదుపులోకి రాకపోవడంతో వారు వెనుతిరగాల్సి వచ్చింది. గ్రామంలో నెలకొన్న భయానక పరిస్థితిని చూసిన గ్రామ సర్పంచ్ అగ్గిమల్ల గోదావరి లస్మన్న, ఉప సర్పంచ్ ఆడెపు రవి తక్షణమే స్పందించి జిల్లా కలెక్టర్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి, తక్షణమే రంగంలోకి దిగారు. యుద్ధప్రాతిపదికన మరో భారీ ఫైర్ ఇంజన్‌ను ఘటనా స్థలానికి పంపించారు.రెండో ఫైర్ ఇంజన్ సాయంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను పూర్తిగా అదుపు చేయడంతో రైతుల పంటలు సురక్షితంగా మిగిలాయి. సకాలంలో స్పందించి పెను ప్రమాదాన్ని తప్పించినందుకు గాను గ్రామ సర్పంచ్‌కు, జిల్లా కలెక్టర్‌కు, అగ్నిమాపక సిబ్బందికి గ్రామస్తులు మరియు రైతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా ఫైర్ ఆఫీసర్ సురేష్ కుమార్ ప్రమాద స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. జరిగిన నష్టాన్ని అంచనా వేసి నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. ఈ సహాయక చర్యల్లో ఫైర్ సిబ్బంది విజయ్ కుమార్, దిక్రాంత్, దశరథ్, చిన్నబాబు తదితరులు పాల్గొని మంటలను అదుపు చేశారు.

# వాంకిడి కాంగ్రెస్‌లో అసమ్మతి సెగ

### మండల అధ్యక్ష పదవి పాతవారికే ఇవ్వాలని డిమాండ్ బీఆర్ఎస్ నేతకు మార్కెట్ డైరెక్టర్ పదవి

### కాంగ్రెస్ కార్యకర్తల్లో ఆగ్రహం కష్టపడ్డవారికి కాకుండా వలస నేతలకు పదవులా?

### లేకుంటే మూకుమ్మడి రాజీనామాలంటున్న సీనియర్లు




**ఆసిఫాబాద్ మే 16 ప్రజా జ్యోతి** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి పాతవారికే ఇవ్వాలని, లేని పక్షంలో ఎస్టీ, ఎస్సీలకు కేటాయించాలని మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేశారు. లేకుంటే మండలంలోని ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్లు, కార్యకర్తలు మూకుమ్మడిగా రాజీనామా చేస్తామని హెచ్చరించారు. శనివారం వారు విడుదల చేసిన ప్రకటనలో టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ దండె విఠల్, డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్కకు విజ్ఞప్తి చేశారు.'గత 15 ఏళ్లుగా పార్టీకి సేవ చేస్తున్నాం. పార్టీ అధికారంలో లేనప్పుడు కాంగ్రెస్ జెండా మోశాం. కష్టకాలంలో కేసులు ఎదుర్కొన్నాం. మండలంలో 10 మంది కార్యకర్తలు ఉన్నా అధిష్ఠానం ఆదేశాల మేరకు కార్యక్రమాలు చేశాం. ఎండనక, వాననక కష్టపడ్డాం' అని ఆవేదన వ్యక్తం చేశారు. 'మొన్న మొన్న ఇతర పార్టీ నుంచి వచ్చిన వ్యక్తులకు పదవులు ఇస్తున్నారు. జిల్లా నాయకుడి సిఫార్సుతో బీఆర్ఎస్‌లో కొనసాగుతున్న వ్యక్తికి మార్కెట్ కమిటీ డైరెక్టర్ పదవి ఇచ్చారు. అభివృద్ధి పనులు కార్యకర్తలకు ఇవ్వకుండా బీఆర్ఎస్ నుంచి వచ్చిన ఒకే వ్యక్తికి రూ.24 లక్షల పనులు కట్టబెట్టారు. కష్టపడ్డ కార్యకర్తలను హీనంగా చూస్తున్నారు' అని ఆరోపించారు. పార్టీ కోసం కష్టపడ్డ నాయకులు, కార్యకర్తలకు అన్యాయం చేయకుండా నామినేటెడ్ పదవులు, ఇతర పదవులు ఇవ్వాలని, తగిన న్యాయం చేయాలని కోరారు.

## శోభాయమానంగా గోమాతకు హారతి



**బాసర మే 16 (ప్రజా జ్యోతి)**నిర్మల్ జిల్లా బాసర శ్రీ వేద భారతి పీఠంలో ప్రతి శనివారం నిర్వహించే గో హారతి కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా రుద్ర హోమం రుద్రాభిషేకలు నిర్వహించి గో హారతి కార్యక్రమాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. భారతదేశానికి వ్యవసాయం వెన్నుముక ఆ వ్యవసాయానికి గోవులు ఆధారం ఆ గోవులను పూజించుకోవడం ప్రతి ఒక్కరికి కర్తవ్యం అని స్వామీజీ తెలియజేశారు వచ్చిన భక్తులందరికీ అన్నదానం నిర్వహిస్తున్నారు

## పూలే విగ్రహావిష్కరణకు ఆహ్వానం

**గ్రంథాలయ చైర్మన్ అనిల్‌కు కౌన్సిలర్ జాడి వినోద్‌ను మాలి సంఘం నేతల వినతి**



**ఆసిఫాబాద్ మే 16 ప్రజా జ్యోతి** కిరిడి గ్రామంలో ఏర్పాటు చేయనున్న మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహావిష్కరణ మహోత్సవానికి రావాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్, జనక్పూర్ 1వ వార్డు కౌన్సిలర్ జాడి వినోద్‌ను కిరిడి గ్రామ మాలి సంఘం నాయకులు ఆహ్వానించారు. శనివారం జిల్లా గ్రంథాలయ కార్యాలయంలో చైర్మన్ అనిల్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మాలి సంఘం నాయకులు శాలువాతో సత్కరించి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా మహాత్మా పూలే ఆశయాలను కొనియాడారు. పూలే విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాలి సంఘం నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## యూ ఆర్ ఎస్ లో చేర్పించండి



**ఇచ్చోడ:మే 16 (ప్రజాజ్యోతి)** ఇచ్చోడ మండలంలోని సాత్ నంబర్‌లో అర్హులైన బాలురను ఉచిత విద్య వసతి గృహ సౌకర్యం ఉన్న అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో చేర్పించాలని ప్రత్యేక అధికారి ప్రశాంత్ రెడ్డి తల్లి దండ్రులను కోరారు.. ప్రొఫెసర్ జయ శంకర్ బడిబాట లో భాగంగా శనివారం సీ ఆర్ టీలతో కలిసి సాత్ నెంబర్ గ్రామంలో బడి బాట నిర్వహించారు. ప్రతి నెల స్టైఫండ్ తో పాటు తెలంగాణ ప్రభుత్వం ఈ విద్య సంవత్సరం నుంచి విద్యార్థులకు 24 వస్తువులతో కూడిన ప్రత్యేక కిట్ ను ఉచితంగా ఇవ్వనున్నట్లు చెప్పారు. యూఆర్ ఎస్ పాఠశాల ను బాలాజీ నగర్ లోని మెరుగైన సౌకర్యాలతో కూడిన పాత కేంద్రీయ విద్యాలయ భవనం లోకి మార్చడం జరిగిందని తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవికాంత్ రెడ్డి, గణేష్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఓటిపి ఫ్రాడ్, ఏపీకే ఫ్రాడ్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

దేశవ్యాప్తంగా సైబర్ నేరాలలో ప్రజలకు అప్రమత్తత, అవగా హన రక్షణ

ఈవారం జిల్లాలో 15 ఫిర్యా దులు నమోదు

ఆర్థిక నేరాలలో వెంటనే 193 0 హెల్ప్ లైన్ ను సంప్రదించాలి

సైబర్ నేరాలలో గోల్డెన్ హవర్ ముఖ్యమైనది జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



**ఆదిలాబాద్ బ్యూరో, మే 16, (ప్రజా జ్యోతి)** దేశవ్యాప్తంగా ప్రజలకు సైబర్ నేరాల పట్ల అవగాహన ఉన్న ట్లయితే సైబర్ నేరాల లో మో సపోకుండా అప్రమత్తంగా వ్యవహరించవచ్చని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన ఐపీఎస్ తెలిపారు. శనివారం పోలీసు ముఖ్య కార్యాలయం నుండి ఒక ప్రకటన విడుదల చేస్తూ, దేశంలో అనేక రకాల సైబర్ నేరాలు చలామణిలో ఉన్నాయని వాటి వల్ల ప్రజలు మోస పోకుండా ఉండాలని జిల్లా ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రత్యేకంగా సైబర్ వారి యర్స్ బృందాలచే, పోలీస్ అ క్క, కాకి కిడ్స్ పేరుతో అవగా హన కార్యక్రమాలను నిర్వహి స్తున్నామని తెలిపారు. వీటివల్ల చైతన్యం పొందిన ప్రజలు వెంటనే మోసపోకుండా ఉండటం జరుగుతుందని, ఒకవేళ మోసపోయినట్లయితే 1930కు సంప్రదిస్తున్నాయం పొందుతున్నారని తెలిపారు. జిల్లాలో అనేక సంఘటనల్లో బాధితులకు తిరిగి డబ్బులు అందించిన ఘటనలు జిల్లాలో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ వారం జిల్లా సైబర్ క్రైమ్‌లో 15 ఫిర్యాదులు నమోదు అయ్యాయని, వాటిని వెంటనే పరిష్క రించేందుకు జిల్లా సైబర్ క్రైమ్ బృందం చర్యలు చేపడుతుందని తెలిపారు. ప్రస్తుతం ఓటీ పీ ఫ్రాడ్, ఏపీకే ఆప్ ఫ్రాడ్ చ లామణిలో ఉన్నాయని, బ్యాంక్ అధికారులు అంటూ, బ్యాంకు ఖాతా నిలిచిపో తుంది అంటూ ఫోన్ ద్వారా ఓటీపీ లు అడిగిన వారికి తమ వ్యక్తి గత సమాచారం వివరాలు అందజేయవద్దని తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకు లకు జాబ్ ఆఫర్లు,వర్క్ ఫ్రొంహోమ్ అంటూ మోసం చేసే ప్రయత్నం జరుగుతుందని వాటి వల్ల యువత అప్రమ త్తంగా ఉండాలని తెలిపారు. దేశ వ్యాప్తంగా లోన్ ఫ్రాడ్, ఇన్వె స్టెంట్ ఫ్రాడ్, జాబ్ ఫ్రాడ్, సో షల్ మీడియా ఫ్రాడ్, ఏపీకే ఫ్రాడ్ లాంటివి చలామణిలో ఉన్నాయని తెలిపారు.

**జిల్లాలో నమోదైన పలు ఫిర్యాదుల వివరాలు**

పట్టణంలోని ఒక వ్యక్తికి బ్యాంకు అధికారి అంటూ 10 లక్ష లు క్రెడిట్ కార్డు బిల్లు చెల్లించాలి అంటూ తమ వ్యక్తిగత వివరాలను తెలుసుకునే ప్ర యత్నం చేయగా బాధితుడు తెలివిగా వ్యవహరించి ఫిర్యాదు చేశారు.పట్టణంలోని ఒక వ్యక్తి రిసార్ట్ బుకింగ్ అంటూ ఆన్లైన్ లో వెతకగా ఒక నకిలీ వెబ్సైట్‌లో ఉన్న నకిలీ వ్యక్తికి ?9,000 ను పంపి మోసపోవడం జరిగింది. తిరిగి ఫిర్యాదు చేశారు. వాట్సాప్ లో అనుకోకుండా ఏపీకే ఫైల్స్ డౌన్లోడ్ చేసుకోవడం వల్ల బాధితుని అకౌంట్ నుండి 97 వేల రూపాయలను సైబర్ నేరగా ళ్లు తస్కరించ డం జరిగింది. అదేవిధంగా మొబైల్ లో ఉన్న వ్యక్తిగత సమాచారాన్ని తస్క రించడం జరిగిందని ఫిర్యాదు చేశారు. ఇన్ స్టా గ్రామ్‌లో బి జినెస్ చేస్తూ ఇంటి వద్ద ఉంటూ ఎక్కువ డబ్బులు సంపా దించవచ్చు అని నమ్మబలికి ఉట్నూర్ బాధితునికి ఒక 1,6 3,000/- మోసం చేయడం జరిగింది. లోన్ అప్లికేషన్ ద్వారా కేవైసీ వివరాలను అందజే సి నేరడిగొండ మండలానికి చెందిన బాధితుడు దాదాపు 40 వేల రూపాయలను మోస పోవడం జరిగింది.

# గిరిజనుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు





సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ

–ఉట్నూర్ ప్రాజెక్ట్ అధికారి మంద మకరందు

**ఆదిలాబాద్ బ్యూరో,మే 16, (ప్రజా జ్యోతి)** ప్రభుత్వం గిరిజనుల సంక్షే మం, అభివృద్ధి కొరకు అనేక కార్యక్రమాలు అమలు చేస్తుం దని, ఈ నేపథ్యంలో గిరిజను ల సమస్యల పరిష్కారానికి ప్ర త్యేక చర్యలు తీసుకోవడం జ రుగుతుందని సమగ్ర గిరిజనా భివృద్ధి సంస్థ –ఉట్నూర్ ప్రాజె క్ట్ అధికారి మంద మకరందు అన్నారు. శనివారం ఉట్నూర్ పరిధిలోని కొమురం భీం కాం ప్లెక్స్‌లోని ఎం ఆర్ సి సమావే శ మందిరంలో ఉమ్మడి జిల్లాల ఆదివాసి సార్ మేడిలు, వివిధ సంఘాల నాయకులతో ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, విద్య, వైద్యం, మౌలిక వసతులు, భూ సమస్యలు, మార్కెటింగ్ తదితర అంశాలపై సమీక్షా స మావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల అభివృద్ధి, గిరిజనుల సంక్షేమం పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిం దని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో తల్లిదండ్రుల ప్రో త్సాహం అత్యంత కీలకమని, పిల్లలను ఉన్నత విద్య వైపుగా ప్రోత్సహించడంలో తల్లి దండ్రులు బాధ్యతగా వ్యవ హరించాలని తెలిపారు. ఉట్నూర్‌లో ప్రధానమంత్రి జుగా పథకం ఆధ్వర్యంలో కేంద్ర గ్రంథాలయం మంజూరు చేయబ డిందని, ఈ గ్రంథాలయం ద్వారా విద్యార్థులు, యువత పోటీ పరీక్షలకు సన్నద్ధం కావ డానికి అవసరమైన పుస్తకాలు, ఆధునిక సౌకర్యాలు అం దుబాటులోకి రానున్నాయని తెలిపారు. గిరిజనుల సమస్య లను త్వరితగతిన పరిష్కరిం చేందుకు ప్రత్యేక కాల్ సెంటర్ ను ఏర్పాటు చేయడం జరు గుతుందని, వాట్సాప్ ద్వారా కూడా ప్రజలు తమ సమస్య లను తెలియజేయ వచ్చని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరి ష్కరించే విధంగా తగిన చర్య లు తీసుకోవడం జరుగుతుం దని తెలిపారు. ఆదివాసి సం ఘాల నాయకులు గిరిజన ప్రాంతాలలో నెలకొన్న పలు సమస్యలను ప్రాజెక్టు అధికారి దృష్టికి తీసుకువచ్చి పరిష్క రించే దిశగా తక్షణ చర్యలు తీ సుకోవాలని కోరారు. ఈ విష యమై ప్రాజెక్టు అధికారి స్పందించి సమస్యల పరిష్కారాని కి కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐటిడిఏ అధికారులు, గిరిజన సంఘాల ప్రతినిధులు, ఆదివాసి నా యకులు, సార్ మేడిలు తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**నేరడిగొండ, మే 16 (ప్రజాజ్యోతి):**బోథ్ నియోజకవర్గంలోని నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ( సీఎంఆర్ఎఫ్ ) కొండంత అండగా నిలుస్తోందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం నెరడిగొండ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 81 మంది లబ్ధిదారులకు రూ. 16,49,500/- విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల ఆరోగ్యం కంటే ప్రభుత్వానికి మించిన ప్రాధాన్యత ఏముంటుందని, అందుకే ప్రభుత్వం సహాయనిధి అమలు శాతాన్ని మరింత పెంచాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతూ, వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న నిరుపేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్హులైన వారు సరైన పత్రాలతో నెరడిగొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

## ట్రాఫిక్ పార్కులో సమ్మర్ క్యాంపు

### పిల్లలకు ట్రాఫిక్ పై అవగా హన, శిక్షణ

ట్రాఫిక్ సిగ్నల్స్, ట్రాఫిక్ గుర్తులు, రోడ్డు భద్రత నియమాల పై అవగాహన

జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



**ఆదిలాబాద్ బ్యూరో, మే 16, (ప్రజా జ్యోతి)** ఆదిలా బాద్ జిల్లా చరిత్రలోనే మొట్ట మొదటిసారిగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వ ర్యంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అధ్యక్షతన ఆదిలాబాద్ పోలీసు హెడ్ క్వార్టర్స్ లో ప్రారంభ మైన సమ్మర్ క్యాంపులో శని వారం పాల్గొన్న విద్యార్థిని, వి ద్యార్థులకు ఉదయం ట్రాఫిక్ పార్కులో ప్రత్యేక ట్రాఫిక్ అవ గాహన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ట్రాఫి క్ ఎస్సై దేవేందర్ చిన్నారుల కు ట్రాఫిక్ సిగ్నల్స్, ట్రాఫిక్ గు ర్తులు, రోడ్డు భద్రత నియమా లు, ట్రాఫిక్ క్రమశిక్షణ, జీబ్రా క్రాసింగ్ వినియోగం వంటి అం శాలపై అవగాహన కల్పించా రు. అలాగే హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం ప్రాముఖ్యత, మై నర్ డ్రైవింగ్ వల్ల కలిగే ప్రమా దాలు, రోడ్డు దాటే సమయం లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాహనాలు నడిపేటప్పుడు పాటించాల్సిన నియమాల ను పిల్లలకు సులభంగా అర్థమ య్యే విధంగా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ మాట్లాడుతూ చిన్నప్పటి నుం చే పిల్లల్లో ట్రాఫిక్ నియమాల పై అవగాహన పెంపొందించడం ద్వారా బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దవచ్చని తెలిపారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ట్రాఫిక్ నియ మాలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించ వ చ్చన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు ఉత్సాహంగా ట్రాఫిక్ నియమాలపై అవగాహన పొందుతూ పోలీస్ అధికారులతో ముచ్చటిం చారు.

## అగ్ని ప్రమాదం లో వ్యవసాయ పరికరాలు దగ్ధం



**సిరి కొండ, మే 16, (ప్రజా జ్యోతి)** సిరికొండ మండలం లోని రాయిగూడ గ్రామంలో శనివారం వ్యవసాయ క్షేత్రంలో జరిగిన అగ్ని ప్రమాదంలో రైతు సీ డాం మదన్ చెందిన కొట్టం (ప శువుల)తో పాటు వ్యవసాయ పరికరాలు పూర్తిగా దగ్ధ మయ్యాయి. రైతు సిడాం మదన్ కొట్టంలో వ్యవసాయ పరికరాలు స్పీన్ క్లర్లు, పైపులు, సోలార్ బ్యాటరీలు, చొప్ప, రేకులు, తదితర వస్తువులు పూర్తిగా కాలిబూడి దయ్యాయి. ఎవరులేని సమయంలో మంటలు ఆకస్మికంగా వ్యాపించగా గ్రామస్తులు నీటితో మంటలు చల్లార్చేందుకు ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. వ్యవసాయ పరికరాలు మొత్తం కాలి బూడిదయి పోయాయి. ఈ ఘటన పై గ్రామ సర్పంచ్ పెందూర్ లక్ష్మణ్ రావు మాట్లాడుతూ అక స్మా త్తుగా జరిగిన ఈ అగ్నిప్రమాద ఘటణ లో రైతుకు నష్టం కలిగిందని, దాదాపు రూ 1, 6 2,000 వేల రూపాయల నష్టం వాటిల్లిందని వెంటనే ప్రభుత్వం నష్ట పరిహారం అందించాలని అన్నారు. రెవెన్యూ అధికారులకు సమాచారం అందించగా వెంటనే ప్రమాదంలో రెవెన్యూ అధికారులు ఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. ఈకా ర్యక్రమంలో సర్పంచ్ పెందూర్ లక్ష్మణ్ రావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజేశ్వర్, గ్రామ పాలన అధికారి రాజేందర్, మాజీ సర్పంచ్ జుగ్నక్ కృష్ణ, గ్రామ స్థులు పంద్రం శ్రీకాంత్, సిడాం రమేశ్వర్, సిడాం అమృత్ రావు, కుంరం చందు, ఆత్రం నాగోరావు, పంద్రం సీతారాం, పంద్రం రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## పూర్తి పారదర్శకంగా రెండు పడక గదుల ఇళ్ల లక్కీడ్రా

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**ఆదిలాబాద్ బ్యూరో, మే 16, (ప్రజా జ్యోతి)** రెండు పడక గదుల ఇళ్లను పూర్తి పారదర్శకంగా లక్కీ డ్రా నిర్వహించి లబ్ది దారులను ఎంపిక చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన రెండు పడక గదుల ఇళ్ల ఎంపిక ప్రక్రియను లక్కీడ్రా ద్వారా ఎంపిక నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మొత్తం వచ్చిన 1,032 దరఖాస్తులకు గాను 337 మంది లబ్ధి దారులను లక్కీడ్రా ద్వారా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ ఎంపికను వార్డుల వారీగా స మానంగా ఉండేలా, సగటున 7 చొప్పున రాండమ్ పద్ధతిలో నిర్వహించామన్నారు. గతంలో లక్కీడ్రా ద్వారా ఎంపిక చే సిన 597 మంది కాకుండా, ఇవి పూర్తిగా నూతనంగా ఎంపిక చేసిన 337 లబ్ధిదారుల వివరాలని ఆయన స్పష్టం చేశారు. ఈ లక్కీడ్రా ద్వారా ఎంపి కైన లబ్ధిదారుల జాబితాను మున్సిపల్ కార్యాలయ నోటీ స్ బోర్డుపై ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఈజాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే మూడు రోజుల గడువులోగా తెలియజేయాలని, ఆమేరకుతుది జాబితాను ఖరారు చేయ నున్నట్లు ఆయన వెల్లడించా రు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రా జేశ్వర్, మున్సిపల్ చైర్ పర్స న్ బండారి అనూష, వైస్ చై ర్మన్ రోహిత్, మున్సిపల్ కమీ షనర్ జగదీశ్వర్ గౌడ్, వివిధ వార్డుల కౌన్సిలర్లు, ఇతర అధి కారులు పాల్గొన్నారు.

# ఆదిలాబాదు వ్యవసాయ మార్కెట్ యార్డ్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆకస్మిక తనిఖీ

## రైతులతో ముఖాముఖి, సమస్యల పరిష్కారానికి తక్షణ ఆదేశాలు జారీ

**ఆదిలాబాద్ బ్యూరో, మే 16, (ప్రజా జ్యోతి)** రైతులకు ఇబ్బందుకు కలగ కుండా, మార్కెట్ యార్డులో సమస్యల పరిష్కారానికి త క్షణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. శనివారం ఆదిలాబాదు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో రైతులు ఎదుర్కొం టున్న ఇబ్బందులను క్షేత్రస్థా యిలో పరిశీలించేందుకు ఆ యన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రైతు లతో ఆయన నేరుగా మాట్లాడి, కాంటా (తూకం) నిర్వహణ, పట్టీల జారీ, మార్కెట్‌లో మౌలిక వసతుల కల్పనపై వివరాలు అడిగి తెలుసుకున్నా రు. రైతుల నుంచి వచ్చిన వి జ్ఞప్తులు, ఫిర్యాదులపై సాను కూలంగా స్పందిస్తూ, మార్కె ట్‌లో నెలకొన్న రద్దీని, రైతుల పై ఉన్న భారాన్ని తగ్గించడానికి ప్రస్తుతమున్న కాంటాలకు అదనంగా మరో ఐదు కాంటాలను (తూకం కేంద్రాలను) తక్ష ణమే పెంచాలని అధికారులను ఆదేశించారు. అలాగే, రైతులకు ఇబ్బంది కలగకుండా కజ్జర్ల, తలమడుగు గోదాములలో సైతం తగిన ఏర్పాట్లను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా వృద్ధ రైతుల పట్ల అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించి, మొదటి ప్రాధాన్యత ఇచ్చి, కాంటా పూర్తి చేయాలన్నారు. దీనితో పాటు మార్కెట్ యార్డ్‌లో రైతుల కు కనీస వసతుల కల్పనలో ఎలాంటి అలసత్వం వహించ వద్దని హెచ్చరించారు. ఎండ తీవ్రత దృష్ట్యా రైతులకు నీడ కోసం అవసరమైన చోట టెంట్లు (షామియానాలు) ఏర్పాటు చేయాలని, స్వచ్ఛమైన త్రాగునీటి సదుపాయం కల్పించాలని ఆదేశించారు. అలాగే, రాత్రి వేళల్లో రైతుల రక్షణ, వారి



తెచ్చిన పంట దొంగతనాలకు గురికాకుండా ఉండేందుకు మార్కెట్ యార్డ్ పరిధిలో నైట్ సెక్యూరిటీని మరింత కట్టుదిట్టం చేయాలని అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. ప్రతి రోజూ 20 వేల గన్ని సంచులు మార్కెట్‌కు రావడం జరుగుతుందని, అధిక మొత్తంలో మార్కెట్ కు జొన్న పం టను తీసుకు రావడం జరుగుతుందని, రవాణా, హమాలీల కొరత సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడం జరుగు తుందన్నారు. అంతకుముందు రాంపూర్ రోడ్ లో గల చాణక్య జిన్నింగ్ మిల్ లో 90 వేల బస్తాల సామర్థ్యం గల గోదా మును కలెక్టర్ పరిశీలించి, అధికారులకు సిబ్బందికి దిగుమతి ప్రక్రియలో వేగం పెంచాలన్నారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ ఆర్. ఎస్. చిత్రు, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, మార్కెటింగ్ అధికారి గజానన్, రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, ఇతర అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమ కారుల వేదిక పక్షాన నిర్వహించిన రాష్ట్ర స్థాయి సదస్సు కు 33 జిల్లాల ఉద్యమ కారులు హాజరు.సభ గ్రాండ్ సక్సెస్

**రాష్ట్ర ప్రభుత్వం,రేవంత్ రెడ్డి వేసిన కేశవరావు చైర్మన్ కమిటీని స్వాగతి స్వాగతిస్తున్నాం:**

**ఎఫ్ఐఆర్, బైండోవర్ కేసులు ఉన్న ఉద్యమ కారులకు జూన్ 2వ తేదీలోగా గుర్తింపు కార్డు, పెన్షన్, ఇంటి స్థలం,ఇల్లు నిర్మాణానికి 10,0000/ లక్షలు, బస్సు,రైల్వే పాస్, హెల్త్ కార్డ్:**

**అందజేయాలని డిమాండ్ చేసిన తెలంగాణ ఉద్యమ కారుల వేదిక రాష్ట్ర చైర్మన్ నరాల సత్యనారాయణ, వైస్ చైర్మన్ తోడేటి శంకర్ గౌడ్:**

**మే 16, సిర్పూర్(టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజా జ్యోతి:** తెలంగాణ ఉద్యమ కారుల వేదిక ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియం బషీర్ భాగ్ లో జరిగిన రాష్ట్రస్థాయి సదస్సు సమావేశానికి తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల ఉద్యమ కారులు హాజరై సభను గ్రాండ్ సక్సెస్ చేశారు. ఈ సమావేశానికి తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ నరాల సత్యనారాయణ వైస్ చైర్మన్ తోడేటి శంకర్ గౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొని ఉద్యమకారు. లతో కలిసి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చీఫ్ మినిస్టర్ రేవంత్ రెడ్డి ఉద్యమ కారుల సంక్షేమం కొరకు వేసిన కేశవ చైర్మన్ కమిటీ ని స్వాగతిస్తున్నా మని అన్నారు. ఎఫ్ఐఆర్, బైండ్ వార్ కేసులో ఉన్న ఉద్యమకారులకు జూన్ 2వ తేదీలోగా ఉద్యమ కారుల గుర్తింపు కార్డు, పెన్షన్,ఇంటి స్థలం,ఇంటి నిర్మాణానికి పది లక్షల రూపాయలతో పాటు బస్సు, రైల్వే పాస్, హెల్త్ కార్డు అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ నరాల సత్యనారాయణ,వైస్ చైర్మన్ తోడేటి శంకర్ గౌడ్ మాట్లాడుతూ..ఎఫ్ఐఆర్ కేసులు, బైండోవర్ కేసులు ఉన్నవారి లిస్టును రెడీ చేయాలని సూచించారు. జూన్ రెండు తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు కేశవరావు ఆధ్వర్యంలో ఏర్పడిన కమిటీని కలుస్తామని తెలిపారు. కేశవ్ కమిటీ నిజమైన ఉద్యమకారు లను గుర్తించి వారి జాబితాను జూన్ 2వ తేదీ లోపు ఉద్యమకారులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు ఈ కమిటీ కి 3 నుండి 5 నెలల లోపు సమయాన్ని కేటాయిస్తున్నామని సభముఖంగా తీర్మానం చేయడం జరిగిందని అన్నారు. ఆలోపు ఉద్యమకారులకు న్యాయం చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం వేసిన కమిటీ కాలయాపన చేసిన ఎడల సహించకుండా









తెలంగాణ ఉద్యమకారుల ఉద్యమం ఊపెత్తున ఎగిసిపడి 33 జిల్లాల ఉద్యమకారులతో కలిసి హైదరాబాద్ వేదికగా ఆందోళనాలు ముమ్మరం చేస్తామని తెలంగాణ ఉద్యమ కారుల వేదిక రాష్ట్ర చైర్మన్ నరాల సత్యనారాయణ, వైస్ చైర్మన్ తోడేటి గౌడ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యమ కారుల వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శ్రావణ బోయిన నరసయ్య, ప్రధాన కార్యదర్శి సైమన్, సోమేశ్వర్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొడ్డు రవీందర్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సులోచనరావు, రాష్ట్ర మహిళా కన్వీనర్ కళావతి, స్వాతి, ఉమా శంకర్ తిరుపతి, వెంకటేష్ గౌడ్, ఉమా, రవీందర్, సింగం నగేష్, నారాయణ, మొహమ్మద్ కబీర్ అహ్మద్, ముస్తఫా, జనార్ధన్, స్వరూప, అనిత చౌదరి, పద్మ, శాంత తదితరులు పాల్గొన్నారు.

## జొన్నల కొనుగోలు కేంద్రాల ఆకస్మిక తనిఖీ

**రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు చేపట్టాలని సి బ్బందికి ఆదేశించిన బోరంచు శ్రీకాంత్ రెడ్డి**



**ఆదిలాబాద్ బ్యూరో, మే 16, (ప్రజా జ్యోతి)** ఆదిలాబాద్ మార్కెట్ పరిధి లోని వివిధ గ్రామాలలో ఏర్పాటుచేసిన జొన్నల కొను గోలు కేంద్రాలను శనివారం ఆదిలాబాద్ వ్యవసాయ మా ర్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులకు ఇబ్బందులు ఏమాత్రం కలగకుండా కొనుగోలు చేపట్టాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. కజ్జర్ల, తాంసి గ్రామాల్లో ఏర్పాటు చేసిన జొన్నల కొను గోలు కేంద్రాలను ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అందుతున్న సౌకర్యాలు, ధాన్యం తూకం ప్రక్రియ, తేమ శాతం నమోదు, హమాలీ వ్యవస్థ తదితర అంశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన శ్రీకాంత్ రెడ్డి, జొన్నల విక్రయానికి వచ్చిన రై తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేసి రైతులకు ఇ బ్బందులు కలుగకుండా చూడాలని,వారి సమస్యలను వెం టనే పరిష్కరించి ప్రభుత్వ కొనుగోలు విధానం పట్ల నమ్మ కంపెంచే విధంగా పనిచేయాలని సూచించారు. ఈ తనిఖీలో కజ్జర్ల సర్పంచ్ నారాయణరెడ్డి, మార్కెట్ యార్డ్ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ పారదర్శకంగా నిర్వహించాలి

**హైదరాబాద్ :** తెలంగాణ భవన్లో జరిగిన సనత్నగర్ నియోజకవర్గానికి చెందిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి, సనత్నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. రాష్ట్రంలో చేపట్టనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమానికి సంబంధించి ఎంపిక చేసిన బూత్ లెవెల్ అసిస్టెంట్లతో కూడిన ఈ సమావేశంలో కేటీఆర్ వారికి ఎస్ఐఆర్ (ప్రాఎఖీ) పైన దిశానిర్దేశం చేశారు. కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణవ్యాప్తంగా "కాంగ్రెస్ పోవాలి, కేసీఆర్ రావాలి" అన్న ఆలోచన ప్రతి ఒక్కరిలో ఉన్నది. ఎప్పుడు ఎన్నికలు జరిగినా ప్రజావ్యతిరేక కాంగ్రెస్ ను పక్కన పెట్టి, ప్రజలు కేసీఆర్ ప్రభుత్వాన్ని తిరిగి తీసుకువస్తారు. తమకు వ్యతిరేకంగా ఉన్న పార్టీల ఓటర్లను, వారి మద్దతు దారులను ఓటర్ల జాబితా నుంచి తొలగించడం, ప్రాంతీయ పార్టీలు ఉన్న రాష్ట్రాల్లో ఈ ఎస్ఐఆర్ను అడ్డగోలుగా వినియోగించడం వంటి అనేక ఆరోపణలున్నాయి. ఎస్ఐఆర్ పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ లేనే లేదు.. కేవలం పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా వచ్చిన గాలి గత్తర వల్ల కొంత కనిపిస్తుంది. సోషల్ మీడియాలో ఎక్కువ, సొసైటీలో తక్కువ ఉన్న పార్టీ బీజేపీ. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చేస్తున్నది కూల్చివేతలే. నగరంలో కనీసం తాగునీటి సరఫరా, దోమల నియంత్రణ వంటి అంశాలను కూడా నిర్వహించలేని పరిస్థితిలో కాంగ్రెస్ పార్టీ ఉన్నదని అన్నారు.

# జన్ భాగేదారి అభియాన్' కార్యక్రమాలపై సమీక్ష

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**ఆదిలాబాద్ బ్యూరో, మే 16, (ప్రజా జ్యోతి)** జన్ భాగేదారి అభియాన్- సబ్సే దూర్, సబ్సే పెహ్లే పై విస్తృత ప్రచారం ద్వారా అవ గాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శనివారం భారత ప్రభుత్వ గిరిజన వ్యవహారాల మంత్రి త్వశాఖ ఆదేశాల మేరకు జిల్లా స్థాయి అధికారులతో జన్ భాగేదారి అభియాన్-సబ్సేదూర్, సబ్సే పెహ్లే అవగాహన కార్యక్రమంపై ఐటీడీఏ పీఓ మంద మకరందుతో కలిసి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించిదిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ, గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం, అర్హులైన లబ్ధిదా రులను ఎంపిక చేసి వారికి ప్రభుత్వ సేవలను చేరవేయ డం ఈ కార్యక్రమ ఉద్దేశమని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ అవగాహన కార్యక్రమాలు 18 మే 2025 నుండి ప్రారంభమై, 25 మే 2026 వరకు వివిధ ద శల్లో కొనసాగుతాయని తెలి పారు. మే 18న బ్లాక్, డిస్ట్రిక్ట్ కలెక్టరేట్లలో 'జన్ భాగేదారి వీక్' అధికారికంగాప్రారంభమై, మే 19 నుండి 25 వరకు గ్రా మ పంచాయతీల్లో 'సాచురేషన్ అండ్ ప్లాంటేషన్ డే' నిర్వ హించి, హెల్త్ స్క్రీనింగ్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. మే 20న గిరిజన ఆవాసాలలో 'ట్రాంజెక్ట్ వాక్', స్వచ్ఛంద సంస్థల ద్వారా ర్యాలీలు చేప ట్టి స్థానిక సమస్యలను గుర్తిం చాలని, మే 21 నుండి 23 వరకు 'జన్ సున్వాయి' (గ్రీవెన్స్) ద్వారా గిరిజనుల సమస్యలను అక్కడికక్కడే పరిష్క రించేలా అర్జీలు స్వీకరించాలన్నారు. మే 24న లబ్ధిదారుల కు ప్రూఫ్ కార్డులు పంపిణీ చేయటం జరుగుతుందని, గ్రామ స్థాయిలో సామజిక మాధ్య మాలు, ఇతర పత్రికలు, ప్రసార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఆరోగ్య శిబిరాల ద్వారా సికల్ సెల్, టీబీ పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో డిడి అంబాజీ, డిఆర్డీఏ పిడి రవీందర్, ఆర్డబ్ల్యూఎస్, ఎంపీడీ ఓలు, మీసేవ ప్రతినిధులు, పి ఆర్, విద్యుత్, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

# ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలి







**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికా రి సుదర్శన్ రెడ్డి**

**ఆదిలాబాద్ బ్యూరో, మే 16, (ప్రజా జ్యోతి)** జిల్లాలో జూన్ 24 నుంచి జు లై 25 వరకు చేపట్టనున్న ప్ర త్యేక సమగ్ర ఓటరు సవరణ (ఎస్ ఐ ఆర్) ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించా రు.శనివారం హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అన్ని జిల్లాల కలెక్ట ర్లు, జిల్లాల ఎన్నికల అధికారు లు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎ స్ ఐ ఆర్ మ్యాపింగ్ పురోగతి, ఇంటింటి ఎస్ఐఆర్ ప్రక్రియలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఆర్.ఎస్.చిత్రుతో కలిసి జిల్లా కలెక్టర్ రాజర్షిషా సంబంధిత అధికారులతో కలిసి హాజర య్యారు. ఈ సందర్భంగా రా ష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్ర త్యేక సమగ్ర ఓటరు సవరణ ప్రక్రియను జూన్ 24 నుంచి జులై 25 వరకు చేపట్ట నున్నా రన్నారని, ఈ సమయంలో బీ ఎల్ ఓ లు ఇంటింటి సర్వే నిర్వహించి, ఎన్యూమరేషన్ ఫారాల ద్వారా వివరాలు సేకరిస్తారన్నారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో త్వరితగతి న మ్యాపింగ్ ప్రక్రియపూర్తి చేయాలని ఆదేశించారు. జూన్ 15 నుంచి 22 వరకు ఈ ఎస్ ఐ ఆర్ ఇంటింటి సర్వే ప్రక్రియ ప్రారంభానికి ప్రణాళికాబద్ధంగా సిద్ధంగా ఉండాలని, జూన్ 24న ప్రారంభమయ్యాక బి ఎల్ ఓ లు ఇంటింటికీ వెళ్లి, ఫారాలను పంపిణీ చేయాల న్నారు. ప్రజలకు తమ ప్రాంతంలోని బీఎల్ ఓ ఎవరో తెలిసేలా, వారి పేరు, మొబైల్ నంబర్, పోలింగ్ కేంద్రం వివరాల గురించి చర్యలు తీసుకోవాలని, విస్తృత ప్రచారం చేప ట్టాలన్నారు. ముఖ్యంగా వీఐ పీ, వీవీఐపీ ఓటర్ల పేర్ల మ్యాపింగ్కు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఫారం-6, 7, 8 ద్వారా వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి, మరణించిన ఓటర్ల వివరాలను ధృవీకరించి, తొలగింపు ప్రక్రియ చేపట్టాలని, బదిలీ ఓటర్లు, మరణించిన ఓటర్ల వివ రాలను సక్రమంగా పరిశీలిం చి, రికార్డులను నవీకరించాలని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయ సమావేశాలు నిర్వహిస్తూ, సమావేశాల మినిట్స్ను భద్రపరచాలని సూచించారు.ఎస్ఐఆర్ కార్యక్రమంపై బూత్ లెవల్ అధికారులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఒకే కు టుంబ సభ్యుల పేర్లు ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధి కారులను ఆదేశించారు.ఈ వీసీ అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రి యను వేగవంతం చేయాలని, అలాగే రాజకీయ పార్టీలతో స మన్వయం చేసుకుంటూ పారదర్శకంగా ప్రక్రియ నిర్వహించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరె న్స్లో ఆర్డీవో జగదీశ్వర్ రావు, పట్టణ తహసీల్దార్ శ్రీనివా స్, ఎన్నికల సూపరింటెండెంట్ నలంద ప్రియా, ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.